

మత్స్య శాఖ జేడీగా శాంతి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 21(ఆంధ్రజ్యోతి: మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్‌గా కె.శాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ మత్స్య శాఖ కమిషనర్ కార్యాలయంలో జేడీగా ఉన్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈ పోస్టులో ఇక్కడున్న నాగేశ్వరరావు పదవీ విరమణ చేసి విషయం తెలిసిందే. గతంలో నాగేశ్వరరావు అనారోగ్య సమస్యలతో నెల రోజులపాటు సెలవు పెట్టగా ఇన్చార్జి జేడీగా ఆమె బాధ్యతలు నిర్వర్తించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయ సిబ్బంది శాంతికి అభినందనలు తెలియజేశారు.



'ఈగల్'కూ దొరకని

ఎంత చేసినా.. ఏమి చేసినా జిల్లాను గంజాయి మత్తు మాత్రం వీడటం లేదు. గంజాయి, మాదకద్రవ్యాల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఈగల్'ను రంగంలోకి దింపినా దాని ప్రభావం అంతంత మాత్రంగానే ఉంటోంది. విశాఖ, దాని పరిసర ప్రాంతాల నుంచి అక్రమ మార్గాల ద్వారా గంజాయిని తెప్పించుకుంటున్న అక్రమార్కులు చిన్నచిన్న ప్యాకెట్లుగా విభజిస్తున్నారు. ఆ తర్వాత వాటిని నమ్మకస్థులు, ప్రత్యేకంగా నియమించుకున్న సేల్స్‌మెన్‌ల ద్వారా యువతకు విక్రయిస్తున్నారు. ఈ మత్తుకు బానిస అయిన యువత నేరాలకు పాల్పడుతోంది. ఇంత జరుగుతున్నా పోలీస్ యంత్రాంగం మాత్రం నిద్రమత్తు వీడటం లేదు.

గం'జాయ్'!



- గుట్టుచప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి, వ్యాపారం
- సేల్స్‌మెన్‌ల ద్వారా విక్రయాలు
- 20 నుంచి 50 గ్రాముల పొట్లాల్లో అమ్మకాలు
- మత్తులో జోగుతున్న విద్యార్థులు, యువత
- పెరుగుతున్న నేరాల సంఖ్య

నెల్లూరు (క్రైం), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు గంజాయిని పెద్దఎత్తున పట్టుకుంటున్నా... ఆ వ్యాపారం మాత్రం జిల్లాలో యథేచ్ఛగా సాగుతూనే ఉంది. గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్ మెంట్)ను రంగంలోకి దించినా గంజాయి విక్రయాలు, సేవనం మాత్రం అదుపు కావడం లేదు. జిల్లాలో విద్యార్థులు, యువత గంజాయి మత్తుకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

● పెరుగుతున్న నేరాలు

ఇటీవల నగరంలో జరుగుతున్న హత్యలు, గొడవలు, హత్యాయత్నాలు, హత్యలు.. తదితర ఘటనలన్నీ కూడా గంజాయి మత్తులోనే జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. గతంలో చిన్నబజారు పోలీసులు డ్రగ్ రాకెట్‌ను అదుపులోకి తీసుకోగా, వారు విద్యార్థులకు డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, మెడికల్ విద్యార్థులు గంజాయి మత్తుకు బానిసలుగా మారుతున్నారు. కళాశాల యాజమాన్యాలకు తెలిసినా, తల్లిదండ్రులకు తెలియజేసి మిన్నకుండిపోతున్నారు. పోలీసులకు మాత్రం ఫిర్యాదు చేయడం లేదు.

● వ్యాపారం ఇలా..

గంజాయి వ్యాపారులు కొత్త పంథాను ప్రారంభించారు. విశాఖ, పరిసర ప్రాంతాల నుంచి గంజాయిని రైళ్లు, రోడ్డు మార్గాన జిల్లాకు తీసుకువస్తున్నారు. వారి నుంచి జిల్లాకు చెందిన కొందరు వ్యాపారులు ఆ గంజాయిని కేజీ రూ.3వేల నుంచి 5వేలకు కొంటున్నారు. వారు కింది స్థాయి వ్యాపారులకు కేజీ రూ.8 వేల నుంచి 10 వేల వరకు విక్రయిస్తున్నారు. గతంలో వీరు 20 నుంచి 50 గ్రాముల పొట్లాలుగా చేసి మత్తుప్రియులకు విక్రయించేవారు. అయితే ప్రస్తుతం వ్యాపారశైలి మారింది. యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వ్యాపారులు జిల్లాలో విక్రయాలు చేస్తున్నారు. కొంతమందిని సేల్స్‌మెన్లుగా ఏర్పాటు చేసుకొని, వారికి ఒక్కో గంజాయి పొట్లంపై కమీషన్‌తోపాటు నెలవారీ జీతం కూడా ఇస్తున్నారు. అంతేగాక విద్యార్థులు, యువతకు ముందుగా శ్యాంపిల్స్ ఇచ్చి గంజాయిని అలవాటు చేస్తున్నారు. అనంతరం వారి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అంతేగాక బార్లు, మద్యం షాపులు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, విద్యాసంస్థలే లక్ష్యంగా అమ్మకాలు జరుపుతున్నారు.

కేసుల వివరాలు ఇలా...

సంవత్సరం	కేసులు	పట్టుకున్నది (కిలోలు)	విలువ (రూ.లక్షల్లో)	అరెస్టులు	వాహనాల సీజ్
2021	16	270.7	2.70	39	7
2022	7	708.4	7.8	15	7
2023	16	369.	3.69	93	10
2024	13	111.9	1.11	44	3



ఆర్టీసీ బస్టాండులో గంజాయి కేసు నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

గంజాయి స్వాధీనం

నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆర్టీసీ బస్టాండులో బస్సులను తనిఖీలు చేస్తుండగా, తమిళనాడు రాష్ట్రానికి చెందిన కన్నదశ, రాజేశ్వర్‌ను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా తునిలోని సతీష్ అనే వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి దుండిగంలో అమ్మేందుకు వెళుతున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెడెంట్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ ఎస్‌డీ కాలేషావలి, కానిస్టేబుళ్ల ఎం.కిరణ్‌సింగ్, గిరిబాబు, జీవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేరుకే పరిమితమా!?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాదక మత్తు, మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా 'ఈగల్'ను ఏర్పాటు చేసింది. అయితే, జిల్లాలో ఈగల్ నిర్మాణం తూతూమంత్రంగా ఉంది. కేవలం ఓ కానిస్టేబుల్ నేతృత్వంలో ఈగల్ ముందుకు అడుగులు వేస్తోంది. దీంతో ఆశించినస్థాయిలో ప్రయోజనం ఉండటం లేదు. జిల్లాలో వరుసగా సాధారణ పోలీసులే గంజాయిని పట్టుకుని, కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం



గంజాయి కట్టడిపై ప్రత్యేకదృష్టి సారించాం. ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం. వారు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, అమ్మకాలు, సేవించడంపై దాడులు నిర్వహిస్తున్నారు. ఆయా స్టేషన్ల పరిధిలోనూ అధికారులు గంజాయి, మత్తుపదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా పరిధిలోని చెక్‌పోస్టుల్లో గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

- జీ. కృష్ణకాంత్, ఎస్పీ

'యాక్సిస్' టోకరాలో

ఆ నలుగురు

- నాలుగు కంపెనీలు.. 56 మంది ఉద్యోగులు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరుతో రూ.10.6 కోట్ల రుణాలు
- బ్యాంకుకు రూ.9.2 కోట్ల రుణ బకాయిల ఎగవేత
- గతేడాది డిసెంబరులోనే వెలుగులోకి..
- అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదు..
- సమగ్ర వివరాలు అడిగినా బ్యాంకు అధికారుల తాత్సారం
- తాజాగా రుణగ్రస్థులకు నోటీసులతో వెలుగులోకి..

ముత్తుకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : సులభంగా బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామంటూ అమాయకులను మభ్యపెట్టారు. వారి ఆధార్ కార్డుల ద్వారా ఖాతాలు తెరిపించి వారి పేరుతో రూ.10.6 కోట్లను స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డిజిటల్ టెక్నాలజీని అడ్డం పెట్టుకుని బ్యాంకులను బురిడీ కొట్టించిన వైనం ఇది. నెల్లూరు నగరం పరిసర ప్రాంతాలకు చెందిన జాలే వాసుదేవనాయుడు, అల్లాబక్షు, శివ, వెంకట్ అనే వ్యక్తులు నగర పరిసర గ్రామాలలో అమాయకులను రుణాలు ఇప్పిస్తామని మభ్యపెట్టి యాక్సిస్ బ్యాంకుల్లో డిజిటల్ అకౌంట్లు తెరిపించారు. ఆపై నకిలీ డాక్యుమెంట్లతో ఏవీ నెట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఎంఆర్ ఇన్ఫోలైన్, గ్లోబల్ సొల్యూషన్స్, క్యాపిటల్ ట్రీ పేర్లతో నాలుగు కంపెనీలను సృష్టించి ముత్తుకూరులోని యాక్సిస్ బ్యాంకులో కంపెనీ ఖాతాలను ప్రారంభించారు. అకౌంట్లు ఉన్న 56 మందిని కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించి ఆరు నెలల పాటు జీతాలను వారి ఖాతాకు బదిలీ చేశారు. అన్నీ సిద్ధం చేసుకున్నాక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా చూపించిన 56 మంది పేరుతో రూ.10.6 కోట్లు డిజిటల్ పర్సనల్ రుణాలు తీసుకున్నారు. కొందరి పేరుతో డిజిటల్ క్రెడిట్ కార్డులు తీసుకుని రూ.26లక్షల46వేల రుణాలు పొందారు. ఇదంతా (మిగతా 7లో..)



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ఉద్రిక్తత

కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు మున్సిపల్ కార్మికుల యత్నం

అడ్డుకున్న పోలీసులు : నలుగురికి అస్వస్థత

నెల్లూరు (వైద్యం) జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె ఉద్రిక్తతకు దారి తీసింది. సోమవారం గాంధీబొమ్మ నుంచి ప్రదర్శనగా వచ్చిన కార్మికులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు అందరూ కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. కేవలం నాయకులు మాత్రము లోనికి వెళ్లాలని సూచించారు. అయితే కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు కార్మికులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని గేట్లు వేశారు. దీంతో పోలీసులు, కార్మికుల మధ్య తోక్కిసలాట జరిగి, నలుగురు కార్మికులు కింద పడిపోయి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. చివరికి కొందరు నాయకులు మాత్రమే ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు మోహన్‌రావు, రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పెంచలనర్సయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నెల్లూరులోనే మొదటిసారి కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసేందుకు మంత్రి నారాయణ పూనుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు సూర్యనారాయణ, సుధాకర్, నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.



కార్మికులను అడ్డుకుని గేట్లు వేస్తున్న పోలీసులు

25న విచారణకు రండి!

● మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకు పోలీసుల నోటీసు

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఫిర్యాదుపై కోవూరు పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి సోమవారం రాత్రి పోలీసులు నోటీసులు అందించారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు కోవూరు సర్కిల్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరు కావాలని, పోలీసులకు తెలియకుండా ఇంటిని విడిచి వెల్లకూడదని ఇలా పలు కండీషన్స్‌తో ప్రసన్నకు ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్ నోటీసులు అందించారు.

ఐరన్‌ఓర్ మైనింగ్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి 8

బస్టాండ్లకు సొబగులు

● జిల్లాలోని ఆర్టీసీలో పలుచోట్ల పనుల ప్రారంభం



జలదంకి ఆర్టీసీ బస్టాండ్‌లో జరుగుతున్న మరమ్మతులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్ల మరమ్మతులపై దృష్టి సారించలేదు. దీంతో ప్రయాణికులకు కనీస వసతులు కూడా వారు బస్టాండ్లకు రావడమే మానేశారు. బస్సులు బస్టాండు బయటే నిలిపే పరిస్థితులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడంపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లను మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

● జలదంకిలో పనుల పూర్తి

జిల్లాలో ముత్తుకూరు, పొదలకూరు, వింజమూరు, కలిగిరి, జలదంకి బస్టాండ్లను మరమ్మతులు చేసేందుకు ఆర్టీసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో భాగంగా ముందుగా జలదంకి బస్టాండు పనులు ప్రారంభించారు. ఆర్టీసీ కార్మికులు పెయింటింగ్‌లు, ఇతర సామగ్రితో జలదంకి బస్టాండులో కనీస వసతులు ఉండేలా పనులు పూర్తి చేశారు. బుచ్చి, ముత్తుకూరు, పొదలకూరు బస్టాండ్ల మరమ్మతుల పనులను కాంట్రాక్టర్లకు అప్పగించగా,టఅక్కడ కూడా పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన బస్టాండ్లలో సైతం త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.



బ్రెయిన్.. బాగుండాలి!

- మెదడు వ్యాధులపై తస్మాత్ జాగ్రత్త
- జిల్లాలో 1.50 లక్షల మంది బాధితులు
- జీవనశైలిలో మార్పు అవశ్యం
- నేడు ప్రపంచ బ్రెయిన్ దినోత్సవం

పొద్దున నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు చిన్నా.. పెద్దా.. అని లేదు, అందరికీ రకరకాల టెన్షన్లు. అన్నీ రంగాల్లో మానసిక ఒత్తిడి పెరగడం, సక్రమంగా నిద్ర పోకపోవడం, శారీరక వ్యాయామం లేకపోవ డం, వీటన్నింటికీ తోడు స్మార్ట్ ఫోన్ వ్యసనం.. వెరసి మనిషి మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా శరీరాన్నంతటినీ నియంత్రించా ల్సిన మెదడు గాడి తప్పుతోంది. వయసుతో నిమిత్తం లేకుండా మెదడు వ్యాధులు బాధిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 1.50 లక్షల మందికిపైగా మెదడు సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు అంచనా. ప్రశాంత జీవనం, ఆరోగ్యకరమైన ఆహారం, యోగా, ధ్యానం వంటివి అలవర్చుకోవడం ద్వారా మస్తిష్కాన్ని రోగాల నుంచి కాపాడవచ్చనేది నిపుణుల సూచన.

- వివరాలు 8లో...

ఐటీఐ రెండోవిడత కౌన్సెలింగ్‌కు ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో రెండో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీన మెరిట్ నెం.1 నుంచి 90వరకు ఉదయం, 91 నుంచి 180వరకు మధ్యాహ్నం కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. 24న 181 నుంచి 270 వరకు ఉదయం, 271 నుంచి 359 వరకు మధ్యాహ్నం ఉంటుందన్నారు. 25న జనరల్ పూల్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని మొబైల్స్ ద్వారా అభ్యర్థులకు తెలియచేశామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.



నాబార్డు నిధులతో అభివృద్ధి చేయనున్న బాంబే హైవే-ఆత్మకూరు రోడ్డు

హలో.. టెండర్ వేయొద్దు!

- ఆ వర్కు నేను తీసుకుంటున్నాను!
- పంచాయతీరాజ్‌లో ఓ కాంట్రాక్టర్ రుబాబు
- రూ.6.30 కోట్లతో ఆత్మకూరు రోడ్డుకు టెండర్లు
- ఆ వర్కుకు పోటీ లేకుండా అడ్డుకునే ప్రయత్నం
- తోటి కాంట్రాక్టర్లకు ఫోన్లు చేసి బెదిరింపులు?

నెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : 'హలో.. నేను ఆత్మకూరు రోడ్డు వర్కును తీసుకుంటున్నాను. మీరు ఆ వర్కు జోలికి రావద్దు. టెండర్ వేయవద్దు. కాదని వేస్తే ఇబ్బందులు పడతారు జాగ్రత్త!' పంచాయతీరాజ్‌లో ఓ కాంట్రాక్టర్ తీరిది. రూ.6.30 కోట్లతో అభివృద్ధి చేయనున్న బాంబే హైవే- ఆత్మకూరు రోడ్డు టెండర్ విషయంలో సదరు కాంట్రాక్టర్ వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తోటి కాంట్రాక్టర్లు పోటీకి రాకుండా ఉండేందుకు అక్రమదారులు తొక్కుతున్నారు. ఎలాగైనా ఈ వర్కును ఎక్సెస్‌కు దక్కించుకునేందుకు కుట్ర చేస్తున్నట్లు పంచాయతీరాజ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకు తనకున్న పలుకుబడిని ఉపయగించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి ఫలితంగా బాంబే హైవే నుంచి ఆత్మకూరు పట్టణంలోకి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డును నాబార్డు ద్వారా రూ.6.30 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం వర్కుకు పంచాయతీరాజ్ అధికారులు టెండర్లు ఆహ్వానించి ఉన్నారు. ఈ నెల 28వ తేదీ వరకూ బిడ్ దాఖలుకు గడువుంది. నాబార్డు వర్కు కావడంతో బిల్లులు త్వరగా వస్తాయన్న ఆశతో కాంట్రాక్టర్లంతా టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కాంట్రాక్టర్లు పోటీ పడితే టెండర్ లెస్‌కు వెళ్లే అవకాశముంది. అప్పుడు ప్రభుత్వ నిధులు ఆదా అవుతాయి. కానీ ఆత్మకూరు మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ ఈ వర్కుపై కన్నేశారు. ఎలాగైనా దక్కించుకోవాలని అడ్డదారులు తొక్కుతున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ వర్కుకు టెండర్ వేసేందుకు సిద్ధమవుతున్న కాంట్రాక్టర్లకు ఫోన్లు చేసి, చేయిస్తూ పరోక్షంగా బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరూ టెండర్ వేయవద్దని సూచిస్తున్నట్లు సమాచారం. ఈ రోడ్డు వర్కుకు టెండర్ వేయాలంటే 70 కి.మీ పరిధిలో మిక్సింగ్ ప్లాంట్ ఉండాలన్న నిబంధన ఉంది. దీంతో ఆ పరిధిలో ఐదు వరకూ ప్లాంట్లు ఉండగా, వారికి కూడా ఫోన్లు చేసి, ఎవరికీ ప్లాంట్లు లీజుకు ఇవ్వొద్దంటూ హెచ్చరిస్తున్నట్లు పంచాయతీరాజ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఈ వ్యవహారం ఇప్పుడు పంచాయతీ రాజ్‌లో చర్చనీయాంశంగా మారింది.

నేడు తిక్కవరప్పాడులో 'సుపరిపాలనలో తొలి అడుగు'

వెంకటాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : తిక్కవరప్పాడులో మంగళవారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతి రెడ్డి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9482
వెండి కిలో ధర	రూ. 116400
వెండి ఒక గ్రాము	రూ. 119.40

మకరతోరణం బహూకరణ



తోరణం బహూకరిస్తున్న వెంకటశివ

పొదలకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరులోని చోళుల కాలం నాటి శివాలయానికి పట్టణానికి చెందిన యనమల వెంకటశివకుమార్, ప్రజ్ఞ దంపతుల కుమారుడు వెంకటపార్థన్య నామకరణ మహోత్సవం సందర్భంగా రూ.3,18,100 విలువైన వెండి మకర తోరణాన్ని ఆలయ అధికారులు ప్రసాద రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కె. సుధాకర్ సమక్షంలో స్వామికి సమర్పించారు. భక్తులు సంగం రోడ్డు నుంచి మేళతాళాలలో దేవస్థానానికి చేరుకున్నారు. ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పాల్గొన్నారు.

'బంగారు కుటుంబం' విజయవంతం చేయాలి

పొదలకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన మార్గదర్శి - బంగారు కుటుంబం పథకాన్ని విజయవంతం చేయాలని పొదలకూరు మండల విద్యాశాఖాధికారి రేణుక సూచించారు. పొదలకూరు మండలంలోని అన్నీ ప్రైవేటు పాఠశాలలకు వెళుతూ ఈ పథకంపై ఆమె అవగాహన కల్పిస్తున్నారు. పొదలకూరు పట్టణం లోని నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఈ పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నం సుబ్బారావు, ప్రిన్సిపాల్ లక్ష్మీదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలను తొలగించాలని వినతి

వెంకటాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనికేపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులు అనధికారికంగా బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నారని, వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అనికేపల్లి గ్రామస్తులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఆనంద్‌ను వినతి పత్రాన్ని అందజేశారు. ప్రైవేటు మద్యం దుకాణాల నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి అనికేపల్లిలో బెల్టు దుకాణాల ద్వారా మద్యాన్ని విక్రయిస్తున్నారన్నారు. గ్రామంలో బెల్టు దుకాణాలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

రీకాలింగ్ చంద్రబాబు.. మేనిఫెస్టో కార్యక్రమం



పోస్టర్లు విడుదల చేస్తున్న పూజిత

పొదలకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కాకుమాను కళ్యాణ మండపంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజితమ్మ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వైసీపీ గుర్తు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రజలు అన్ని విషయాలూ గమనిస్తున్నారన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి, జైళ్లకు పంపుతు న్నారన్నారు. ప్రతి పథకం అమలయ్యేంత వరకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొ న్నారు.

వీళ్ల 'బెల్ట్' తీసేదెవరు?

● పల్లె పల్లెలో అనధికార మద్యం దుకాణాలు ● మద్యం మాఫియా స్వార్థానికి పేద కుటుంబాల బలి



ఇందుకూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త మద్యం పాలసీని అమలు చేస్తోంది. ఎన్నికల ముం దు ఇచ్చిన హామీ మేరకు గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న అధిక ధరలను తగ్గించి, తక్కువ ధరకే నాణ్య మైన మద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసు కుంటోంది. అంతేకాదు.. మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపులకు టెండర్ల విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే మద్యం అమ్మాలంటూ ప్రత్యేక జీవో కూడా తీసుకొచ్చింది. అయితే టెండర్లలో మద్యం షాపులు దక్కించుకున్న నిర్వాహకులు నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవ హరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తు న్నాయి. మండల పరిధిలోని ఐదు షాపుల యజ మానులు పల్లెల్లో వీధి వీధిలోనూ అనధికారి కంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యం. అంతేకాదు.. అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. బెల్ట్‌షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరిపితే అధికారులు తనిఖీలు నిర్వహించి భారీ స్థాయిలో జరిమానాలు విధించాల్సి ఉంది. అయినా మళ్లీ మళ్లీ మద్యం దుకాణాల యజమానులు బెల్ట్‌షాపులకు మద్యం విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయాలని ప్రభుత్వం జీవోలో స్పష్టంగా పేర్కొంది. కానీ ప్రభుత్వ జీవోను తుంగలో తొక్కి మద్యం షాపుల యజమానులు, సంబంధిత అధికారులు కుమ్మక్కై బెల్ట్‌షాపుల నిర్వహణకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తున్నట్లు విశ్వస నీయ సమాచారం. షాపు యజమానులు రాజకీయ పలుకుబడితో బెల్ట్ షాపుల ద్వారా అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అనేకసార్లు పత్రికల్లో బెల్టు షాపులపై కథనా లు వచ్చినా సంబంధిత ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తునట్లు తెలు స్తోంది. ఎక్సైజ్ అధికారులు ఇప్పటిదాకా బెల్టు షాపులపై ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎన్ని షాపుల లైసెన్స్‌లు రద్దు చేశారు? అనే వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం. పైగా ఎక్సైజ్ అధికారులు, మద్యం షాపుల యజమానుల అండ దండలతోనే ఊరూరా.. వీధి వీధినా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నారు. పల్లె పల్లెలో బెల్ట్ షాపులు అందు బాటులో ఉండడం వల్ల యువకులు, వృద్ధులు మద్యానికి బానిసలవుతున్నారని పేద, మధ్యతరగతి కుటుంబాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో దాడులకు దిగుతున్నారని, ఇటీవల ఇలాంటి సంఘటనలు అనేకం జరిగాయని వాపోతు న్నారు. ఇప్పటికైనా బెల్టుషాపులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

వెంకటాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ వలీ వైద్య సిబ్బందిని ఆదేశించారు. చెముడుగుంట పంచాయతీ బూరాన్‌పూరులో సోమవారం కసుమూరు వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రిజిస్టర్లను పరిశీలించారు. టీబీ ముక్తా భారత్ కార్య క్రమంలో భాగంగా అనుమానితుల గళ్ళను సేకరించి, ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించాలన్నారు. 100 శాతం టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. టీబీ నిర్మూలనకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో దోమలు, నీటి నిల్వ ద్వారా సంభవించే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ ఉమామహేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెముడుగుంటలో నాటక ప్రదర్శన

వెంకటాచలం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెముడుగుంట గ్రామంలో ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అరుణోదయ నాట్యమండలి ఆధ్వర్యంలో పలు నాటకాలను ప్రదర్శించారు. నాట్యమండలి ఆర్గనైజర్ కేవీ శేషయ్య ఆధ్వర్యంలో గయోపాఖ్యానం, మదనకుంభినీ యుద్ధం, మోహినీ విజయం నాటకాలను రెండు రోజులుగా నాట్యకళాకారులు ప్రదర్శించారు. ప్రేక్షకులను కళాకారులు గాన మాధుర్యంలో ఓలలాడించారు. ఆదివారం రాత్రి నాటకాలను ప్రదర్శించిన కళాకారులను పలువురు నాయకులు, గ్రామస్తులు సన్మానించారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారుల బృందం

పేదల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం

ముత్తుకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పేదల పక్షాన సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య తెలిపారు. సోమవారం సర్వేపల్లి నియోకవర్గం ముత్తుకూరు పార్టీ కార్యాలయంలో సోమవారం సీపీఐ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వందేళ్ల పూర్తయిన సందర్భంగా ప్రతి శాఖలోనూ వందేళ్ల ఉత్సవాలను జరుపుకున్నామన్నారు. ప్రజా సమస్యలే ప్రధానంగా పోరాటాలు చేశామన్నారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ కిషోర్, సర్వేపల్లి కార్యదర్శి తుంగ ఏడుకొండలు, నాయకులు ముజీబ్‌బాషా, కోమారి నందయ్య, బద్రి వెంకటేశ్వర్లు, కాకి వెంకటశేషయ్య, బూదురు కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మద్దెల మడుగు సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన కంప్యూటర్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హనుమంతయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ లేదా ఎంఎస్సీ కంప్యూటర్ అర్హత కలిగి ఉండాలన్నారు. అలాగే నెట్, సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 25న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

బాలసంజీవిని యాప్‌ను తక్షణమే తొలగించాలి



ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

రాపూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. బాలసంజీవిని యాప్‌ను తక్షణమే తొలగించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. అధ్యక్షురాలు జయసుధ, కార్యదర్శి ప్రమీల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా

కోవూరు, జూలై21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు నాలుగేళ్ళ కిందట సరఫరా చేసిన సెల్‌ఫోన్లు పనిచేయడం లేదన్నారు. యాప్‌లకు సరిపడినంత నెట్ స్పీడు రావడం లేదన్నారు. మారుమూల ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పనిచేయకపోవడంతో యాప్‌ల ద్వారా సమాచారం ఇవ్వలేకపోతున్నామన్నారు. గతంలో అనుసరించిన విధానంలోనే సరకులు పంపిణీ చేయాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం సీడీపీఓ జ్యోతికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు సుభాషిణి, ఎల్‌వీ శేషమ్మ, రాజ్యలక్ష్మి, సునీత, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రతి రోజు స్లిప్ టెస్ట్ పెట్టాలి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రోజు విద్యార్థులకు తప్పనిసరిగా స్లిప్ టెస్ట్ నిర్వహించి, వారి స్థాయికి తగినవిధంగా విద్యాబోధన చేయాలని సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి జి. సుధీర్‌బాబు ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం పెనుబల్లి మోడల్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న సంసిద్ధత, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ తదితర కార్యక్రమాల అమలుపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యా ప్రమాణాలు పెంచాలనీ, రోజూ గ్రంథాలయంలో ఓ పుస్తకాన్ని పిల్లల చేత చదివించాలని సూచించారు. కృత్యాలు, ఆటల ద్వారా ఆసక్తికరంగా విద్యను బోధించేలా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 పాతపాటి వెంకటరత్నం, సీఆర్‌ఎంటీ మహేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న సుధీర్ బాబు

కామాక్షితాయి సేవలో సోమిరెడ్డి శృతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి సోమవారం శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని దర్శించుకున్నారు. శ్రీ భ్రమరాంబిక సేవా సమితి బృందంతో వచ్చిన శృతిరెడ్డిని ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం కామాక్షితాయికి ఆషాఢమాసం సారెను సమర్పించారు. అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు.

రాపూరులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

రాపూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మునగాల వెంకటాపురం పంచాయతీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు చెన్ను అశోక్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునగాల రమేష్, హరినాథ్, సింకర్ల రామయ్య, మనుబోలు హరయ్య, అనుకు అంకయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విభేదాలు వీడి.. అభివృద్ధికి పాటుపడండి!

'సుపరిపాలనకు తొలిఅడుగు'లో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దిశానిర్దేశం



కోవూరు : ఆరోగ్య కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, అజీజ్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విభేదాలు వీడి సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలని కోవూరు ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం పెనుబల్లి, మినగల్లు గ్రామాల్లో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ కలసి పని చేయాలన్నారు. పెనుబల్లిలో రూ. 29 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు నిర్మా ణానికి ఆమె భూమి పూజ చేశారు. గత ప్రభుత్వంలో టీడీపీ కార్య కర్తలపైన పెట్టిన అక్రమ కేసులు త్వరలోనే ఎత్తివేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. తహసీల్దారు వెంకటేశ్వర్లు, సర్పంచులు ఊడా పెంచలయ్య, బొర్రు పూజిత, ఎంపీటీసీ వినయ్ నారాయణ, కూటమి నాయకులు హరికృష్ణ, మహేంద్ర, సురేంద్ర, శ్రీనివా సులు, మల్లారెడ్డి, గోపి, రాము, శిరీష, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

● గిరిజన సంక్షేమానికి కృషి

కోవూరు : గిరిజన సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. పడుగుపాడు మజరా చంద్రమౌళి గిరిజన కాలనీలలో సోమవారం ఆమె గిరిజనులకు హెల్త్‌కార్డులు అందచేశారు. గిరిజనులు అత్యధిక నివసించే కోవూరు నియోజకవర్గానికి తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పారు. ఇటీవల 500 మంది గిరిజనులకు ఆధార్ కార్డులు జారీ చేసేందుకు కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జయభారత్ హాస్పిటల్ జీఎం గురుప్రసాద్ , బీజేపీ నాయకులు రాఘవేంద్ర, విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, పఠాన్ నజీర్‌బాషా పాల్గొన్నారు.

● కొడవలూరును పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతాం

కొడవలూరు : ఇఫ్కో కిసాన్ సెజ్, మీ అదానితోపాటు పలు పరిశ్రమలు తీసుకొచ్చి కొడవలూరు మండలాన్ని పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. రామన్నపాలెం, రెడ్డిపాలెం, మానెగుంట పాడు, ఆలూరు పాడు గ్రామాలలో 'సుపరిపాలనలో ముంద డుగు' కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్‌అజీజ్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, దయాకర్ రెడ్డి, వినీల్ రెడ్డి, డేగ రవిరెడ్డి, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

వరుస చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్టు

● తిరుపతిలోనూ ఇదే ముఠా దోపిడీ
● కావలి వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో పట్టపగలే వరుస చోరీలకు పాల్పడిన ముఠాను కావలి వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నగరంలో రెండురోజుల క్రితం పట్టపగలే చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలోని ఉమాకాంత్ ఇంట్లో 12 సవర్ల బంగారు నగలు, సోమేశ్వరి ఇంట్లో 36.75 గ్రాముల నగలు, అదే ప్రాంతంలో మరో ఇంట్లో దోపిడీకి యత్నించారు. అదే రోజు వేదాయపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని బుచ్చయ్య ఇంట్లో 50 సవర్ల బంగారు ఆభరణాలు, నగదు, వెండి దోచుకెళ్లారు. ఒకేరోజు నగరంలో వరుసగా మూడు ప్రాంతాల్లో చోరీలు, ఓ ఇంట్లో దోపిడీయత్నం జరగడం జిల్లావ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ క్రమంలోనే జిల్లాలో జరిగిన చోరీల గురించి తెలుసుకున్న తిరుపతి జిల్లా పోలీసులు ఇదే కోవలో తమ జిల్లాలోనూ చోరీలు జరిగాయని ఇక్కడ పోలీసు అధికారులతో చర్చించారు. దీంతో అప్రమత్తమైన నెల్లూరు, తిరుపతి పోలీసులు నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో తిరుపతి పోలీసులు నెల్లూరులో దొరికిన సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నలుగురు నిందితులను కావలి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఎవరూ లేని సమయంలో ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని కొత్తూరు ఎంజీబీ లేవుట్‌లో ప్రభుత్వ ఉద్యోగి వెంగయ్య-లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారి ముగ్గురు కుమారులు చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. లక్ష్మి ఇటీవల తన పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 19న వెంగయ్య పొదలకూరులోని ఆఫీసుకు వెళ్లారు. అక్కడ నుంచి తన స్వగ్రామమైన చిలకలమర్రికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 44గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. 20వ తేదీ సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన పక్కింటివారు వెంగయ్యకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో ఆయన నగరానికి చేరుకున్నారు. చోరీ ఘటనపై సోమవారం వేదాయపాలెం పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు ఏడుగురికి గాయాలు



డివైడర్‌పైకి ఎక్కిన కారు

సంగం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను కారు ఢీకొనడంతో ఏడుగురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని సిద్దీపురం ముంబాయి జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న కారు వేగంగా వెళ్తూ మార్గమధ్యంలో వెంగారెడ్డిపాళెం క్రాస్ రోడ్డు దాటిన తరువాత సిద్దీపురం ప్రారంభం వద్ద రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు



బస్సులో నుంచి జారిపడి గాయపడిన రోశయ్య

సీతారామపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బస్సులో నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సీతారామపురం నుంచి పోరుమామిళ్ల వెళ్ళు ఘాట్ రోడ్డులో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణప్పపేట గ్రామానికి చెందిన ఎర్రపాలెం రోశయ్య పనిమీద కడప జిల్లా పోరుమామిళ్ళకు బద్వేలు డిపో ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. బస్సులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఫుట్‌పాత్‌పై నిలబడ్డాడు. బస్సు ఘాట్ రోడ్ మార్గంలో మలుపు తిరుగుతుండగా రోశయ్య ఫుట్‌పాత్‌పై నుంచి జారి రోడ్డుపై తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి ప్రయాణికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి...



చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

ఉదయగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణ శివారు ప్రాంతమైన విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన గల 167-బీజీ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు స్కూటీపై దుత్తలూరు వైపు వెళుతున్నాడు. అలాగే దుత్తలూరు నుంచి విజయ్ అనే వ్యక్తి తన మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వస్తున్నాడు. ఈ తరుణంలో సబ్‌స్టేషన్ వద్దకు రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని ఇతర ప్రాంతాలకు తరలించారు. పోలీసులు వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

'సోమశిల'కు 3,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి సోమవారం 3,055 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 27.616 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 400, పెన్నా డెల్టాకు 4,300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

చిన్నారుల ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరం

ఆత్మకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 520

రాష్ట్రాభివృద్ధికి అనుకూలమైన బిల్లు : ఎంపీ బీఎమ్మార్

నెల్లూరు(వ్యవసాయం), జూలై 21 (ఆం ధ్రజ్యోతి): రాష్ట్రంలోని తీరప్రాంత అభివృద్ధి కి బిల్స్ ఆఫ్ లాడింగ్ బిల్-2024 ఎంతో అనుకూలమని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. రాజ్యసభలో సో మవారం ఈబిల్లుపై ఆయన ప్రసంగించా రు. 1856 నాటి పురాతన చట్టాన్ని రద్దు చేసి డిజిటల్ ఆధారితమైన షిప్పింగ్ పత్రా ల వ్యవస్థను ఏర్పరిచే దిశగా ముందడుగు వేయడం జరిగిందన్నారు. ఏపీ సముద్ర విధానం- 2024, కేంద్రం ప్రవేశపెట్టిన ఈబి ల్లు పరస్పర అనుబంధంగా పనిచేస్తూ రా ష్ట్రాన్ని 2030 నాటికి ప్రధాన మెరైన్ గేట్‌వే గా తీర్చిదిద్దుతుందని ఆయన చెప్పారు. ఈచట్టంపై మాట్లాడే అవకాశం కల్పించిన కేంద్ర నౌకాశ్రయ, పోర్టు మంత్రిత్వశాఖ, చైర్‌పర్సన్‌లకు, ఏపీ సీఎం చంద్రబాబునా యుడికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

న్యూస్ బాక్స్

రేపు మాస శివరాత్రి

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీనగర్‌లోని కృష్ణమందిరంలో భవానీ శంకరస్వామికి బుధవారం మాస శివరాత్రి పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 6గంటలకు ప్రత్యేక రుద్రాభిషేకాలు, పూజలు ఆలయ అర్చకులు బీ.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపింది. రాత్రి 8గంటలకు భవానీ శంకరస్వామికి నివేదన, మంగళహారతులు నిర్వహిస్తామని, భక్తులు ఈ పూజల్లో పాల్గొనాలని కమిటీ కోరింది.

మెదడుకు రక్షణ భవిష్యత్తుకు భరోసా

నెల్లూరు (వైద్యం) జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మెదడుకు రక్షణ భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందని మెడికవర్ ఆసుపత్రి న్యూరోసర్జన్ డాక్టర్ గంగపట్నం దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవనశైలి, ఒత్తిడి, సరైన నిద్ర లేకపోవటం, పోషకాహార లోపం, శారీరకశ్రమ లేకపోవటం వంటి కారణాలు మెదడుపై ప్రభావం చూపుతాయని తెలిపారు. వీటి ఫలితంగా స్ట్రోక్, అల్జీమర్స్, పార్కిన్‌సన్, డిమెన్షియా, బ్రెయిన్ ట్యూమర్‌ల వంటి న్యూరోలాజికల్ సమస్యలు పెరుగుతున్నాయన్నారు. చిన్న వయసు నుంచే మెదడు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యమన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, శారీరక శ్రమ, మెదడుకు రక్తప్రసరణ పెంచి జ్ఞాపకశక్తిని ఆలోచనాసామర్థ్యాన్ని పెంచుతాయని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా కమిటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి సోమవారం రాత్రి ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ఎర్రబోలు రాజేష్, పొన్నూరు మాధవి, బత్తల కృష్ణయ్య, కాసా శ్రీనివాసులు, చీదర్ల శివపార్వతిని నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా యశ్వంత్‌సింగ్, బెల్లంకొండ మాల్యాద్రి, యాకసిరి ఫణిరాజు నియమితులయ్యారు. కార్యదర్శులుగా కరటంపాటి సుధాకర్, మారెళ్ల బ్రహ్మారెడ్డి, ముక్కు రాధాకృష్ణ, పైడిమణి సుజన, వడ్డే శ్రీనాథ్, అల్లూరు నాగవేణి, మేడపల్లి రత్నం నాయుడు, కోశాధికారిగా సీవీ రత్నం, సోషల్ మీడియా కన్వీనర్‌గా సన్నారెడ్డి సాయికుమార్, ఐటీ సెల్ కన్వీనర్‌గా బుజ్జి రామకృష్ణ నియమితులయ్యారు.

'అన్నదాత సుఖీభవ' దరఖాస్తుకు రేపటి వరకు గడువు

కలిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23వ తేదీ వరకు గడువు ఉందని తహసీల్దారు గిరీష్ సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని రైతులు పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, 1బి, అడంగల్ కాపీలను సమీప సచివాలయం లేదా తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

510 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 633 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు 510 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-97, ఆర్‌ఆర్-5, సీఆర్-12, జంపింగ్ లాట్స్-9 కారణాలతో 123 బేళ్ల తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160గా నమోదైంది.

'యాక్సిస్' టోకరాలో ఆ నలుగురు

(5వ పేజీ తరువాయి)

ఫిబ్రవరి 2022, జనవరి 2024 మధ్య కాలంలో చోటుచేసుకుంది. ఆపై కొద్ది నెలల పాటు రుణాల ఈఎంఐ కింద రూ.కోటి41 లక్షల నగదు చెల్లించారు. ఆపై అడ్రస్ లేకుండా వెళ్లిపోయారు. రుణాలన్నీ డిజిటల్‌గా తీసుకోవడంతో ఆయా ఖాతాదారులకు రుణాల సంగతి తెలియకపోవడం గమనార్హం. రుణాల బకాయిలు పేరుకుపోవడంతో నెల్లూరు నగర యాక్సిస్ బ్యాంకు మేనేజర్ మన్నేపల్లి మదన్మోహన్ కంపెనీ ఖాతాలు ఉన్న ముత్తుకూరు పరిధి పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది డిసెంబరు 23న ఫిర్యాదు చేశారు. తమ బ్యాంకును వాసుదేవనాయుడు, అల్లాబక్షు, శివ, వెంకట్‌లు 56 మందితో కలిసి నకిలీ పత్రాలు దాఖలు చేసి ఉద్దేశపూర్వకంగా రుణాల పేరుతో రూ.9.20 కోట్లు స్వాహా చేసి మోసం చేశారని ఆ ఫిర్యాదులో తెలిపారు. అప్పట్లో విచారించి కేసు రిజిస్టర్ చేసిన పోలీసులు 56 ఖాతాలను సంబంధించి దాఖలు చేసిన ధ్రువపత్రాలు, ముత్తుకూరు బ్యాంకులోని నాలుగు కంపెనీ ఖాతాల వివరాలు అందజేయాలని, బ్యాంక్ అధికారులకు లిఖితపూర్వకంగా కోరారు. అయితే, ఎందుకనో ఈ కేసు దర్యాప్తులో పురోగతి కనిపించలేదు. తాజాగా నాలుగు రోజుల కిందట యాక్సిస్ బ్యాంకు నుంచి అసలైన ఖాతాదారులకు రుణాలు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామంటూ నోటీసులు జారీ అయ్యాయి. అసలు రుణాలు ఏమిటి.. ఎవరు ఇచ్చారో తెలియని కొందరు ఖాతాదారులు నెల్లూరులోని గిరిజన సంక్షేమ సంఘాన్ని ఆశ్రయించడంతో గుట్టు రట్టయింది.

బోర్డు పెట్టారు.. ప్రారంభం మరిచారు!

- పేరుకే వెంకటేశ్వరపురంలో ఔట్‌పోస్టు
- నేరగాళ్ల నిలయంగా జేఆర్ కాలనీ
- తరచూ హత్యలు,దాడులు
- టిడ్కో ఇళ్లలోనూ, జగనన్న కాలనీల్లోనూ అపరిచితుల నివాసం
- గంజాయి, మద్యం మత్తులో నిత్యం గొడవలు
- పట్టించుకోని పోలీసులు



బోర్డు మాత్రమే ఉన్న పోలీసు ఔట్‌పోస్టు

నెల్లూరు(వెంకటేశ్వరపురం) జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం పరిధిలోని జనార్దన్‌రెడ్డి (జేఆర్) కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, టిడ్కో నివాసాలు, జగనన్న కాలనీలు నేరగాళ్లకు నిలయంగా మారాయి. తరచూ హత్యలు, కొట్లాటలతో నిత్యం ఈ ప్రాంతాలు వార్తల్లో నిలుస్తున్నాయి. గంజాయి, సొల్యూషన్ సేవించడం , ఆ మత్తులో ఇతరులపై కత్తులతో దాడులు చేయడం, రోడ్డుపై అడ్డంగా కూర్చొని మద్యం తాగడం, అడిగితే వారిపై విచక్షణారహితంగా దాడులు చేయడం... రాత్రిళ్లు ఒంటరిగా వెళితే...వారిపై దాడి చేసి దోపిడీకి పాల్పడడం లాంటి సంఘటనలు ఈ ప్రాంతంలో ఎక్కువగా జరుగుతున్నాయి. మైనర్లు ఆటోలు నడుపుతూ చెడు అలవాట్లకు ఆకర్షితులవుతున్నారు. చిన్నతనంలోనే గంజాయి, సొల్యూషన్‌కు బానిసలుగా మారిపోతు న్నారు.పుస్తకాలు పట్టాల్సిన చేతులతో కత్తులు పడుతూ నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల హత్యలు,గొడవలు ఈ ప్రాంతాల్లోనే అధికమయ్యాయి. అయితే పోలీసుల దృష్టికి వెళ్లేవి కొన్ని మాత్రమే.

● అపరిచితులతో ఆందోళన

54 డివిజన్ పరిధిలోని ఈ ప్రాంతాల్లో సుమారుగా 20 వేల మందికిపైగా నివాసాలు ఉంటున్నారు. ఎక్కువ మంది పేదలు..రోజూవారీ కూలీలు. తరచూ హత్యలు,గొడవలు,కొట్లాటలతో ఈ ప్రాంతవాసులు ఆందోళనకు గురవుతున్నారు. అంతేకాక టిడ్కో నివాసాలు,జగనన్న కాలనీల్లో ఇతర ప్రాంతాల నుంచి అపరచితులు వచ్చి నివాసాలు ఉంటున్నారు. దీంతో ఏ క్షణంలో ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

● ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలి

జేఆర్‌కాలనీ ప్రాంతంలో ఔట్‌పోస్టు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతాల్లో నేరాలు కాస్త తగ్గుతాయని గతంలో పోలీసు అధికారులు నిర్ణయించారు. తరచూ హత్యలు, కొట్లాటలు జరుగుతున్నా ఔట్‌పోస్టు మాత్రం ఏర్పాటు చేయలేదు. కొన్ని నెలల క్రితం ఔట్‌పోస్టు కోసం గతంలో సుజల స్రవంతి భవనాన్ని సిద్ధం చేశారు. బోర్డు పెట్టి వదిలేశారు. అయితే ఇంతవరకూ దాన్ని ప్రారంభించనే లేదు. ఇప్పటికైనా ఈ ప్రాంతాల్లో పోలీసులు శాంతిభద్రతలు కాపాడాల్సి ఉంది.ఔట్‌పోస్టు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



శాకంబరిగా గాయత్రీదేవి

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా నగరంలోని విరాట్‌నగర్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గాయత్రీదేవికి శాకంబరి అలంకారం జరిగింది. ఈ సందర్భంగా సామూహిక సహ స్ర నామార్చనలు జరిగాయి. అనంతరం గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామికి కనుల పండువగా పల్లకీసేవ జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలుగా గుమ్మడిపూడి సురేష్‌ఆచారి, కృష్ణవేణి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ పర్యవేక్షించింది.

చెస్ విజేత పృథ్వీకుమార్


బహుమతులు అందుకున్న విజేతలతో నిర్వాహకులు

నెల్లూరు(విద్య), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా చెస్ పోటీల్లో నెల్లూరుకి చెందిన పృథ్వీకుమార్ విజేతగా నిలిచారు. నగరంలోని ఎంజీబీ మాల్‌లో అంతర్జాతీయ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర చెస్ సంఘం, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఆలిండియా చెస్ పోటీల్లో పృథ్వీకుమార్ ప్రథమ, గుంటూరుకు చెందిన డీ.ధృవేష్ ద్వితీయ, ఎం.మహేంద్ర తృతీయస్థానాలను సాధించారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో మాల్ డీజీఎం మల్లికార్జునరెడ్డి మాట్లాడారు. మేధావుల క్రీడగా గుర్తింపు పొందిన చెస్‌ను సాధన చేస్తే చిన్నారుల్లో ఆలోచనా విధానం పెరుగుతుందన్నారు. అనంతరం విజేతలకు రూ.1.5లక్షల నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.సుమన్, హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ జీ.శారద, ఎంజీబీ అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ డైరక్టర్ ఎం.గోపీనాథ్, కోచ్‌లు సుమంత్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లో సమస్య చెబితే నేనే వస్తా

- రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరురూరల్, జూలై 21,(ఆంధ్రజ్యోతి) : 'ఏదైనా సమస్యను ఫోన్ చేసి చెబితే నేనే వస్తా... నావల్ల అయితే చేసిపెడతా'నని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఒకటో డివిజన్ కోడూరుపాడులో దోభీఘాట్, జడ్పీ స్కూల్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ ప్రజలకు తాను చాలా రుణపడి ఉన్నానని తెలిపారు. తన కార్యాలయం వరకు వచ్చి ఇబ్బందులు పడవద్దని, ఫోన్‌లోనే సమస్య ఉంటే చెబితే చాలన్నారు. ఎన్నికల సమయాల్లోనే తాను రాజకీయాలు చేస్తానని, మిగిలిన సమయాల్లో కేవలం అభివృద్ధే అజెండాగా ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ జానా నాగరాజు, నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, తంబి శ్రీనివాసులు, చిరంజీవి, ఒట్టూరు సురేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- మంత్రితో గిరిధర్ భేటీ

ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. తిరుపతి జిల్లా గూడూరుకు వచ్చిన ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.


శిలఫలకం ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నాయకులు

నెల్లూరు రూరల్లో రోడ్ల నిర్మాణాలు, పొట్టేపాళెం, ములుముడి గ్రామాల వద్ద కలుజులపై వంతెన కల్వర్టల నిర్మాణాలకు నిధుల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదన్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్‌బజారు పనులు త్వరగా పూర్తి చేయండి

- నగర కమిషనర్ నందన్ ఆదేశం

నెల్లూరు(సిటీ), జూలై 21,(ఆంధ్రజ్యోతి) : వీధివ్యాపారుల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌బజారు పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను నగర కమిషనర్ నందన్ ఆదేశించారు. సోమవారం పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా మైపాడు రోడ్డులోని జాఫర్ సాహెబ్ కాలువ కట్టపై నిర్మిస్తున్న ఫుడ్ కోర్టు దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ స్మార్ట్‌బజార్‌ను రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా వీధివ్యాపారులకు మంచి ప్లాట్‌ఫాం ఏర్పాటు కానున్నదని వివరించారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎస్‌ఎంసీలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో పాల్గొన్నారు. నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. టిడ్కో గృహాలన్నింటినీ విజయదశమి నాటికి లబ్ధిదారులకు అందచేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


స్మార్ట్ బజారులో ఓ దుకాణాన్ని పరిశీలిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ నందన్, అధికారులు

వైభవంగా కుండల దర్గా గంధోత్సవం



దర్గాకు పూల అలంకరణ, (పక్కన) ప్రసాదం కుండలు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బారకాసు సెంటర్‌లో ఉన్న హజరత్ ఫయిజుల్లాషా ఖాదిరి కుండల దర్గా గంధ మహోత్సవం సోమవారం అర్ధరాత్రి వైభవంగా జరిగింది. ఈ గంధ మహోత్సవం బ్యాండు కచేరీ, ఫకీర్ల జరీబులతో, భారీ విద్యుద్దీపాలంకరణలతో దర్గా నుంచి పెద్దబజారు, చిన్నబజారుల మీదుగా సంతపేట, ఖాజాపీర్ సెంటర్ దర్గా వరకు వెళ్లి, మంగళవారం తెల్లవారుజామున దర్గాకు చేరింది. ఈ సందర్భంగా కోర్కెలు కోరుకునే భక్తులకు మలీదా మట్కీలు (ప్రసాదం కుండలు) మంగళవారం మధ్యాహ్నం 12గంటల వరకు పంచుతారు. అలాగే గత ఏడాది మలిదా మట్కీలు అందుకున్న భక్తులు ఈ ఏడాది మట్కీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం జరిగింది. మంగళవారం రాత్రి 11గంటలకు మిలాదే షరీఫ్ ఖసిదేఖాని జరుగుతుంది. బుధవారం ఉదయం 7గంటలకు తహలీపాతేహా, 11గంటలకు అన్నదానం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ తెలిపింది. ఈ గంధ మహోత్సవంలో మలిదా మట్కీలు (ప్రసాదం కుండలు) పట్టుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచేకాక తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

మేత సంకలితాలతో చేపల్లో రోగ నిరోధకశక్తి పెంపు

- కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ లలితా శివజ్యోతి


మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ లలితాశివజ్యోతి

నెల్లూరు(వ్యవసాయం), జూలై 21(ఆంధ్రజ్యోతి): పొడి దాణాలకు ప్రత్యామ్నాయయంగా మేత సంకలితాలను వాడడం వల్ల చేపల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డాక్టర్ లలితాశివజ్యోతి పేర్కొన్నారు.తద్వారా ఆదాయం రైతులకు ఆదాయం పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఆమె పేర్కొన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) వారి సహకారంతో నెల్లూరు కేవీకేలో చేప పిల్లల నర్సరీ పెంపకం, నిర్వహణపై ఐదు రోజులు నిర్వహించే శిక్షణ సోమవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ మేత సంకలితాల వాడకంలో రైతులు శాస్త్రవేత్తల సిఫార్సు చేసిన మోతాదు మేరకు వినియోగించాలని తెలిపారు. మత్స్య విభాగ శాస్త్రవేత్త హరిసాధు మాట్లాడుతూ ప్రీబయోటిక్స్, ప్రోబయోటిక్స్ వాడకంలో ఆహార పదార్థంగా వినియోగించుకోవడం వల్ల ప్రోబయోటిక్ సామర్థ్యతలను పెంచుకోవడం, చేపల వ్యాధుల నిర్ధారణ, నియంత్రణలతోపాటు చేపలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అధునాతన సాంకేతికత, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై విస్తరణ విభాగం శాస్త్రవేత్త లోకేష్‌బాబు, చేప నర్సరీలో మేత సంకలితాల వాడకంపై అల్బా బయోలాజికల్ కన్సల్టెంట్ డాక్టర్ రవికుమార్, మేత సంకలితాల తయారీ, మార్కెటింగ్‌పై బెంగళూరు హెలిక్స్ బయోసైన్సెస్ సీఈవో అరుణ కుమార్ రైతులకు వివరించారు.

మాతా పరమేశ్వరి గ్రామోత్సవం



సంగం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్ పోస్టు కాలనీలో ఉన్న మాతా పరమేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న జాతర ఉత్సవంలో భాగంగా సోమవారం అమ్మ వారి గ్రామోత్సవం నిర్వహించారు. మాతా పరమేశ్వరిదేవి పులి వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

30న పారా అథ్లెటిక్స్ పోటీలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాల్యాద్రి

కావలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): జూనియర్స్, సబ్‌జూనియర్స్ విభాగాల్లో పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఈనెల 30వ తేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని పారా క్రీడల కమిటీ జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రినాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని భవిత పాఠశాలలో దివ్యాంగులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ జిల్లాలోని దివ్యాంగ క్రీడాకారులందరూ ఈ పోటీలకు హాజరు కావాలని కోరారు. జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో అర్హత సాధించిన వారి ని రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలకు, రాష్ట్రస్థాయి అర్హత సాధించిన వారిని జాతీయస్థాయి క్రీడల కు ఎంపిక చేస్తామన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు ఉద్యోగాలలో మూడు శాతం రిజర్వేషన్‌ను కూటమి ప్రభు త్వం కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశా రు. క్రీడలకు హాజరయ్యే విద్యార్థులు దివ్యాం గుల సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫొటోతో సొంత ఖర్చులతో వచ్చి ఈనెల 30న ఉదయం 9 గం టలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న పెంచలయ్య

కావలి(టౌన్), జూలై 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను ఏజెన్సీలకు అప్పగించకుండా పర్మినెంట్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. సోమవారం 5వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్మికులను ప్రైవేట్ ఏజన్సీలకు అప్పజెప్పాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరే కిస్తున్నామన్నారు. వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తోపాటు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు చట్టబద్ధమైన సెలవులివ్వాలని జీవో 36 ప్రకారం జీతాలివ్వాలని కోరారు. కార్యక్ర మంలో సీఐటీయూ నాయకులు ఎం పోలయ్య, ఎస్‌కె షాన్‌వాజ్, యూనియన్ నాయకులు టీ శీనయ్య, రమేష్, మహేష్, చిన్నమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

శబాష్ సారూ..

- నాడు 22.. నేడు 110 మంది
- ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్య



ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా చేయాలని సంకల్పించిన ఆ ఉపాధ్యాయులు ఆ దిశగా అడుగులు వేశారు. 22 మంది ఉన్న విద్యార్థుల సంఖ్యను 110కి పెంచారు. అనంతసాగరం ఉర్దూ ప్రాథమి క పాఠశాలను ఈ ఏడాది ప్రభుత్వం ఆదర్శ పాఠశాలగా గుర్తించి, ఐదుగురు ఉపాధ్యాయులను నియమించారు. అప్పటికి అక్కడ విద్యార్థుల సంఖ్య కేవలం 22 మంది మాత్రమే. కాగా ఆ సంఖ్యను ఎలాగైన పెంచాలని టీచర్లు సంకల్పం బూని విద్యార్థుల కోసం వేట సాగించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి పిల్లల్ని ఆదర్శ పాఠశాలకు పంపాలని అభ్యర్థించారు. ప్రైవేటుకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని నమ్మకం నమ్మకం కలిగించారు. ఇంకేముంది.. ఒక్కొక్కరు గా పాఠశాలలో చేరడం ప్రారంభించి, చివరకు 110 మందికి చేరింది.

● వెంటాడుతున్న సమస్యలు

విద్యార్థుల సంఖ్యను పెంచడంలో ఉపాధ్యాయుల కృషి ఫలించింది. అయితే అందుకు తగ్గట్టు అక్కడ వసతులు మాత్రం కరువయ్యాయి. వర్షం కురిస్తే చాలు పాఠశాల ప్రాంగణం చిత్తడిగా మారుతుంది. మరుగుదొడ్లు సరిగా లేవు. కొన్ని తరగతి గదుల్లో వైట్‌వాష్ చేయలేదు. ఫ్యాన్లు లేవు. అధికారులు చొరవ చూపి స్కూలులో వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

యూరియా టెన్షన్ వద్దు!

కలువాయి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి కళారాణి తెలిపారు. సోమవారం ఏకరాకు ఒక బస్తా వంతున 400 బస్తాలు అధికారులు రైతులకు పంపిణీ చేశారు. మండలంలోని కలువాయి, మాదన్నగారి పల్లె, కుల్లూరు, బద్దెవోలకు ఇప్పటికి 2300 బస్తాలు యూరియా పంపిణీ చేశామని, ఇంకా కావలసిన రైతులకు రైతుసేవా కేంద్రాల ద్వారా సొసైటీ ద్వారా యూరియా అందజేస్తామని తెలియ జేశారు. కాగా, సోమవారం యూరియా కోసం పెద్ద ఎత్తున రైతులు కలువాయి సొసైటీ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు అవగాహన కార్యక్రమాలు, రక్షణ చర్యలు తీసుకుంటున్నా కొందరికి తలకెక్కడం లేదు. ఒకరు లేదా ఇద్దరు వెళ్లాల్సిన మోటారుబైక్‌పై ముగ్గురు, నలుగురు ప్రయాణం చేస్తున్నారు. అందులోనూ హెల్మెట్ కూడా ధరించడం లేదు. ఆదివారం సంగం ముంబాయి జాతీయ రహదారిపై ఓ కుటుంబం లోని భర్త, భార్య, ఇద్దరు పిల్లలు ఒకే మోటారుబైక్‌పై వెళ్తూ ఆంధ్రజ్యోతి కంటపడ్డారు. ఇలాగైతే ప్రమాదాలు జరగవా.. ప్రాణానికి రక్షణ ఎక్కడ ఉంటుందని పలువురు పేర్కొన్నారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)



ఇలాగైతే ప్రమాదాలు జరగవా?

సేంద్రియ ఎరువులపై
అవగాహన పెంచుకోవాలి

● డీఏవో సత్యవాణి ● పోస్టర్లు విడుదల చేసిన కలెక్టర్, జేసీ



సేంద్రియ, జీవన ఎరువుల వినియోగంపై అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), జూలై 21 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ, జీవన ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి పేర్కొన్నారు. సేంద్రియ, జీవన ఎరువులు, పొడినేలల్లో చల్లే నవధాన్యాల పద్ధతులపై అవగాహన కల్పించే పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్, జేసి కార్తీక్ విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా 25 శాతం వరకు రసాయనిక ఎరువుల ఖర్చును తగ్గించవచ్చన్నారు. రైజోబియం, బ్లూ గ్రీన్ ఆల్గే, అజొల్ల, మైకోరైజా వంటి నత్రజని ఆధారిత జీవ ఎరువుల వాడకం వల్ల వాతావరణంలోని నత్రజనిని నేలలో నిలుపుతూ మొక్కలకు అందుబాటులోకి తీసుకురావచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, ఏడీఏ నర్సోజీరావు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం రాజ్‌కుమార్, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● పీ 4 గ్రామసభలు పక్కాగా జరగాలి : కలెక్టర్

పేదరికంలో ఉన్న కుటుంబాలను గుర్తించడం, ఆర్థికంగా స్థిరపడిన మార్గదర్శులకులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పీ 4 గ్రామ సభలు పక్కాగా జరగాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన ప్రాంగణంలో సోమవారం పీ 4పై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పీ 4 కార్యక్రమం ఉద్దేశ్యాన్ని ఆయా శాఖల పరిధిలోని కిందిస్థాయి సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఈసమావేశంలో డీపీవో శ్రీధర్‌రెడ్డి, జడ్పీ సీఈవో మోహన్ రాజు, సీపీవో నరసింహారావు, జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, డ్వామా పీడీ గంగా భవాని, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, డీఎంహెచ్‌వో సుజాత, డీటీసీ చందర్ తదితరులు పాల్గొన్నారు.

● కంపోస్టబుల్ ఉత్పత్తులే వాడాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు కంపోస్టబుల్ ఉత్పత్తులే వాడాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవన ప్రాంగణంలో సోమవారం కంపోస్టబుల్ ప్రొడక్ట్‌లపై అవగాహన కల్పించారు. జేసి కార్తీక్ మాట్లాడుతూ ఈ ఉత్పత్తులపై అన్నీ శాఖల అధికారులు అవగాహన పెంచుకుని కలెక్టర్ సూచనల మేరకు తొలి అడుగు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్‌కుమార్, జిల్లా అధికారులు లక్ష్మీ పాలీమర్స్ రాజు, ఎలైట్ బయోటెక్ కంపెనీ ప్రతినిధి హేమసాయి తదితరులు పాల్గొన్నారు.

మెదడును మెలిపెట్టొద్దు!

● నేడు ప్రపంచ బ్రెయిన్ దినోత్సవం

- ఆధునిక సమాజంలో మెదడు వ్యాధులు అధికం
- జీవనశైలిలో మార్పులతో అనర్థాలు
- అన్నీ వయసుల వారికి సమస్యలు
- వృద్ధాప్యంలో మరింత చేటు
- జిల్లాలో 1.50 లక్షలమంది వ్యాధిగ్రస్థులు
- ముందు జాగ్రత్తలు తప్పనిసరి

మానవ శరీరంలో అత్యంత ప్రాధాన్యత గల భాగం మెదడు(బ్రెయిన్). శరీరాన్నంతటినీ నియంత్రించేది ఇదే. అలాంటి మెదడు ఆరోగ్యం విషయం లో అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం చేస్తే శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతినే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ న్యూరోఫెడరేషన్ మెదడుకు సంబంధించి అనేక హెచ్చరికలు చేశారు. ఈ క్రమంలో ఏటా జూలై 22వ తేదీన ప్రపంచ మెదడు దినోత్స వం జరుపుకోవాలని నిర్ణయించాయి. మెదుడు వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని సూచించింది.

వ్యాధులకు కారణాలు....

- విపరీతంగా మద్యం సేవించడం
- ప్రకాశవంతమైన కాంతిని అదే పనిగా చూడడం
- మందులు విపరీతంగా తీసుకోవడం
- ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు
- ప్రమాదాల సమయంలో హెల్మెట్ వాడకపోవడం
- ఎక్కువగా కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్లతో కాలం గడపడం
- ఎక్కువ ఎత్తు ప్రదేశాలు ఎక్కడం
- ప్రసవ సమయంలోగానీ, ప్రమాద సమయంలోగానీ తలకు గాయం కావడం
- మెదడులో కంతులు, చీముగడ్డలు, హెచ్ఐవీ సంక్రమణ.

రోగ నిర్ధారణ... చికిత్సలు

- రక్తపరీక్షలు, కంప్యూటరైజ్డ్, యాక్సియల్ కోమోగ్రఫీ పరీక్షలు, ఎలక్ట్రో ఎన్సెఫాలోగ్రఫీ(ఈఈజీ) చేస్తారు.
- సిటీస్కాన్, మాగ్నటిక్ రిసోనాన్స్ ఇమేజింగ్(ఎంఆర్ఐ) ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు.
- యాంటీ కన్వల్సెన్స్ అనే మందులు ఉపయోగించడం
- మెదడులోని వ్యాధికి కారణమైన భాగాన్ని శస్త్రచికిత్స ద్వారా తొలగించడం
- ఆహార నియమాలు పాటించడం
- అధిక కొవ్వు, తక్కువ పిండి పదార్థాలు వాడడం
- మూర్ఛ వ్యాధిని తగ్గించేందుకు మెదడులో ఉన్న వేగస్ అనే ప్రాంతాన్ని పేస్‌మేకర్ వంటి ఎలక్ట్రికల్ పరికరాన్ని అమర్చడం ద్వారా ప్రేరేపించడం.



నెల్లూరు (వైద్యం), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక జీవనశైలిలో విపరీతమైన ఒత్తిళ్ల కారణంగా, మనోవేదన కారణంగా ఎంతో మంది మెదడు సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. కొందరు జన్యు సంబంధ కారణాలతో ఈ వ్యాధులబారిన పడుతున్నారు. జిల్లాలో 1.50 లక్షలమందికిపైగా మెదడు సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు సమాచారం. వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ ఈ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. మెదడు కణాల్లో ఏర్పడిన సమస్య కారణంగా శరీరంలో కొంకర్లు, మూర్ఛ, ఫిట్స్ వంటి సమస్యలు వస్తున్నాయి. ఎక్కువగా పట్టణ ప్రాంతాల వారు ఈ వ్యాధులకు గురవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. నిత్యం ఉరుకులు.. పరుగుల జీవితం, శారీరక వ్యాయామం లేకపోవడం మెదడు పనితీరుపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా వ్యాధులపై పూర్తిగా అవగాహన పెంచుకుని ప్రశాంత జీవనాన్ని అలవాటు చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వృద్ధాప్యంలో మరింత జాగ్రత్త

వృద్ధాప్యంలో మెదడు వ్యాధుల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. బ్రెయిన్ స్ట్రోక్‌తోపాటు, పార్కిన్‌సన్, మతిమరుపు వంటివి బాధిస్తాయి. 60 నుంచి 80 ఏళ్ల వయసున్న వారిలో 10 నుంచి 20 శాతం మంది ఈ వ్యాధుల బారినపడుతున్నట్లు అంచనా. నరాల వ్యాధులతో బాధపడేవారు త్వరగా మెదడు వ్యాధులకు గురవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఇడియోపతి పార్కిన్‌సన్స్(వణుకుడు) వ్యాధి సాధారణంగా వృద్ధాప్యంలో వస్తుంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారుతుంది. మెదడులోని డొపెమిన్ నరాలు సంఖ్య తగ్గడం వల్ల ఈ వ్యాధికి గురవుతారు. క్రమంగా మతిమరుపు పెరిగి ఆ తర్వాత మనుషులను గుర్తించలేని స్థితికి చేరుకుంటారు.

అప్రమత్తంగా ఉండాలి



మెదుడు వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరగా నయంచేసే అవకాశం ఉంటుంది. నిర్లక్షం వహిస్తే ఒక్కోసారి అది ప్రాణాపాయానికి దారితీస్తుంది. వృద్ధులకు ఎక్కువగా పార్కిన్‌సన్ వ్యాధి వస్తుంది. ఇది మెదుడులోని రసాయన లోపం వల్ల వస్తుంది. వీటి లక్షణాలను ముందే గ్రహిస్తే నివారణ మార్గాలు కూడా ఉన్నాయి.

- డాక్టర్ ధీరజ్, జీజీహెచ్, న్యూరో సర్జన్

27, 28 తేదీల్లో వడ్డెరల సంఘం రాష్ట్ర మహాసభలు



పాటల క్యాసెట్‌ను విడుదల చేస్తున్నవడ్డెర సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం) జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఈ 27, 28వ తేదీల్లో నెల్లూరు నగరంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ తెలిపారు. సోమవారం నగరంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోటకొండ వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ వడ్డెర సమాజం నిర్మాణ రంగంలో పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. అయితే ప్రభుత్వం వీరికి తగిన ప్రాధాన్యత ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలును, ఇబ్బందులను కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ప్రజా నాట్యమండలి వడ్డెరల సమస్యలపై రూపొందించిన పాటల క్యాసెట్లను విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, కోశాధికారి మల్లి నాగార్జున, నేతలు వల్లపు సుధాకర్, బత్తుల రత్తయ్య, నారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా మాజీ కార్యదర్శి విజయ కుమార్, సోమవరపు వెంకయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఎస్‌టీసీలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష కార్యాలయం పరిధిలో జిల్లాలో నిర్వహించే నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ల(ఎన్‌ఆర్‌ఎస్‌టీసీ)కు మండలాల వారీగా అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 14 ఏళ్లలోపు బడి మానేసిన విద్యార్థులను, ఇప్పటి వరకు పాఠశాలలకు వెళ్లని పిల్లలను, వివిధ పనులు చేస్తున్న పిల్లలను గుర్తించి వారిని ఎన్‌ఆర్‌ఎస్‌టీసీలలో చేర్పించాలన్నారు. ఇందు కోసం అన్నీ మండలాల్లోనూ కేంద్రాలు ఏర్పాటుకు స్థానికంగా బీఈడీ, డీఈడీ అర్హతున్న అభ్యర్థులు ఈనెల 24 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అన్నీ ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వైద్య సేవల ధరలు ప్రకటించాలి

● డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం) జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్‌లు, ల్యాబ్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా ఆయా వైద్య సేవల ధరల పట్టికను ప్రకటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ఆసుపత్రుల ముందు ధరల ప్రకటన బోర్డులు పెట్టాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఆసుపత్రి, డయాగ్నోస్టిక్, ల్యాబ్‌ల వద్ద సేవల ధరలను కచ్చితంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. అలాగే రిసెప్షన్ కౌంటర్ వద్ద స్పష్టంగా కనిపించేలా ఈ పట్టిక ఉంచాలన్నారు. ఆ వివరాలను ఫొటోతీసి వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపాలన్నారు. ఈ ప్రక్రియను వారంలో పూర్తి చేయాలని ఆమె సూచించారు.

వైసీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలులో ఉన్నందున తాత్కాలికంగా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు. కాకాణి అందుబాటులోకి వచ్చే వరకు చంద్రశేఖర్‌రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారని తెలిసింది. కాగా, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా ఉన్న ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టయిన నేపథ్యంలో ఆయన స్థానంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును నియమించారు.

ప్రజా ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ ఆనంద్ ● అందిన 249 ఫిర్యాదుల్లో రెవెన్యూవే అధికం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(విద్య), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో కొన్ని శాఖలు వెనుకబడి ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సర్వే, ఎడ్యుకేషన్, పోలీస్, గనులశాఖ, డిజేబుల్ వెల్ఫేర్, దేవదాయ శాఖలు సమస్యల పరిష్కారంలో వెనుకంజలో ఉన్నాయన్నారు. ఫిర్యాదుల విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని, ప్రతీ శాఖ కూడా ఫిర్యాదుల విషయంలో ఆడిట్ నిర్వహించుకుంటూ సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. మొత్తం 249 ఫిర్యాదులు అందగా, వీటిలో రెవెన్యూవి 103, సర్వే, ల్యాండ్ రికార్డ్‌కు 16, మునిసిపల్‌వి 16, పంచాయితీరాజ్‌వి 16, ఎడ్యుకేషన్‌వి 15, పోలీస్ శాఖవి 11 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్‌సాహెబ్, జడ్పీ సీఈవో మోహన్‌రావు, డీపీవో శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మునిపిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా కలెక్టర్ చొరవ చూపాలని సీఐటీయూ నేతలు కోరారు. కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం గాంధీబొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. పోలీసులతో జరిగిన స్వల్ప వివాదం అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, సీఐటీయూ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, పెంచల నరసయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

● అక్రమాలను విచారించాలి

జలదంకి పంచాయతీలో అక్రమాలకు పాల్పడే పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలని సర్పంచి సీహెచ్.అనూరాధ కోరారు. సోమవారం ఆమె కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. తమ పంచాయతీలో సర్పంచితో పాటు 14 మంది వార్డు సభ్యులు ఉండగా, పంచాయతీ కార్యదర్శి ఏకపక్షంగా రికార్డుల్లో సంతాకలు పెడుతున్నాడని ఆరోపించారు. అందరినీ బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు. సదరు కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● మరణ ధ్రువీకరణ ఇప్పించండి

భర్త చనిపోయి బాధల్లో ఉన్న తనకు తన భర్త మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా సంబంధిత అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని బుచ్చి మండలం పెనుబల్లికి చెందిన ఇండ్ల లక్ష్మమ్మ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని ఆమె కోరారు.

● రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

సంగం మండలం జెండాదిబ్బలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి సంజయ్‌కుమార్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో 15 ఏళ్లుగా ఎలాంటి వసతుల్లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు దృష్టి సారించి గ్రామంలో వసతులు కల్పించాలని కోరారు.

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కి 82 వినతులు

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కి జిల్లా వ్యాప్తంగా 82 మంది బాధితులు తరలి వచ్చి, వారి సమస్యలను విన్నవించుకున్నారు. నగర డీఎస్పీ పీ. సింధుప్రియ, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌కి వచ్చిన ఫిర్యాదులన్నింటీ పై చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.



ఫిర్యాదుదారుడి సమస్యను వింటున్న మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రామారావు

ఐరన్‌ఓర్ మైనింగ్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతల డిమాండ్



విలేకరుల సమావేశంలో పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

కందుకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): లింగ సముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో ఉన్న అపార ఐరన్‌ఓర్ ఖనిజ సంపదను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టకుండా ప్రభుత్వమే మైనింగ్ నిర్వహించి జాతిసంపదను కాపాడాలని ఆమ్ ఆద్మీ, సీపీఎం, సీపీఐ పార్టీలు, వివిధ ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు, ప్రజాసంఘాల నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బీ వెంకటేశ్వర్లు(బీవీ) తదితరులు ఐరన్ ఓర్ ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు భావిస్తున్న గ్రామాల్లో సోమ వారం పర్యటించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అపార ఖనిజ సంప దను జేఎస్‌డబ్ల్యూ (జిందాల్) కంపెనీకి కట్టబెట్టడం సరికాదని, ప్రభుత్వమే మైనింగ్ నిర్వహించాలని, వీలైతే ప్రభుత్వమే ఉక్కు కర్మాగారం స్థాపించి ఐరన్‌ఓర్‌ను వినియోగించి జాతిసంపదను పెంపొందించాలని డిమాండ్ చేశారు. రెండు మండలాల పరిధిలో ఐరన్‌ఓర్ నిక్షేపాలు ఉన్నట్లు జియోగ్రాఫికల్ సర్వేలో తేలినందున ఇక్కడ ఐరన్‌ఓర్ కోసం ప్రైవేట్ సంస్థలు తవ్వకాలు ప్రారంభమైతే పవిత్ర పుణ్యక్షేత్రమైన మాలకొండ పరిసరాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కందుకూరు నియోజకవర్గంలో తూర్పు తీర ప్రాంతాన్ని విశ్వేశ్వరరెడ్డికి, పశ్చిమప్రాంతాన్ని జిందాల్ కంపెనీకి కట్టబెట్టేందుకు వైసీపీ, టీడీపీలు ఒకే అజెండాతో ముందుకు సాగుతుండటం నియోజకవర్గ ప్రజల దురదృష్టమని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం నాయకులు బీ. సురేష్‌బాబు, ఎస్ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

ఉదయగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్‌ఆర్ సర్కిల్ సమీపంలో ఉన్న నిజాముద్దీన్ ఔలియా వారి గంధ మహోత్సవాన్ని సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని పకీరు జరుబులు, మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల, విద్యుత్ దీపాల వెలుగుల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9482
వెండి కిలో ధర	రూ. 116400
వెండి ఒక గ్రాము	రూ. 119.40

న్యూస్ బాక్స్

మాతా పరమేశ్వరి గ్రామోత్సవం



ఊరేగుతున్న మాతా పరమేశ్వరి

సంగం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్‌పోస్టు కాలనీలో ఉన్న మాతా పరమేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న జాతర ఉత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. మాతా పరమేశ్వరిదేవి పులి వా హనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఆత్మకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం, వెంకట్రావుపల్లి, పేరారెడ్డిపల్లి శాంతినగర్‌లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవాసమితి పొదలకూరు కమిటీ అధ్యక్షుడు జి పెంచల నరసయ్య మాట్లాడుతూ త్రైత సిద్ధాంత గ్రంథాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు ఎం కొండయ్య, పి మధు, పి గాయత్రి, పి కిషోర్, ఈ పద్మమ్మ, శేషాద్రి, టి నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



సర్వేయర్లకు సూచనలిస్తున్న తహసీల్దారు జయవర్ధన్

అనంతసాగరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలపై వచ్చిన అర్జీలపై విచారణ జరిపి పరిష్కరించాలని సర్వేయర్లకు తహసీల్దారు జయవర్ధన్ సూచించారు. నూతనంగా బదిలీపై వచ్చిన సర్వేయర్లతో తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారికి పలు సూచనలు చేశారు.

పోషక విలువలు కలిగిన ఆహారంతో ఆరోగ్యం



కూరగాయలను విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతారామపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని మోడల్ మేకర్ సురేష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఏ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, తదితర ఉత్పత్తులు స్టాల్ ద్వారా వినియోగదారులకు విక్రయించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ రవి, ఫార్మర్ సైంటిస్ట్ నాగలక్ష్మి, ఐసీఆర్‌పీలు దేవసహాయం, సుల్తానా బేగం, శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

వివాద స్థలంలో చెట్ల తొలగింపు



చెట్లు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆత్మకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి చిరువెళ్ల పంచాయతీ పరిధిలోని నబీనగరంలో ఒక వివాదంలో హైకోర్టు పరిధిలో ఉన్న స్థలం ఆక్రమణకు సంబంధించి (డబ్ల్యుపి 18297-2025)తో స్టేటస్ కో ఆర్డర్ ఉన్నప్పటికీ నిబంధనలు అతిక్రమించి కొందరు జేసీబీతో చెట్లు, మొద్దులు తొలగించి కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు షేక్ ఫరూక్, ఆయన కుటుంబ సభ్యులు కోరారు.

పారిశుధ్యం పట్టదా..?

● స్వచ్ఛతే సేవలో అధికారులు ● అధ్వానంగా ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు



ఎంఈవో కార్యాలయ సమీపంలో మొలిచిన పిచ్చిమొక్కలు

ఆత్మకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపాల్టీ, మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ అధికారులు తాము కొలువుదీరే కార్యాలయాల ఆవరణలు పిచ్చిమొక్కలతో నిండి చెత్తా చెదారం పేరుకుపోయినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు అధ్వానంగా ఉన్నాయి. సీఎల్‌డీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కార్యాలయంతో పాటు ఎంఈవో, ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వెలుగు కార్యాలయాలు, సచివా లయం ఉన్నాయి. ఈ కార్యాలయాలకు నిత్యం అధికారులు, సిబ్బందితో పాటు వందల మంది ప్రజలు వచ్చిపోతుంటారు. అయితే ఎంఈవో కార్యాలయం సమీపంలో పిచ్చిమొక్కలు, నీటి గుంటలతో అపరిశుభ్రంగా ఉంది. ఇక ఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు కార్యాలయాల సమీపంలో పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలన సాగిస్తున్నారని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. సోమవారం కాంచెరువు, తూర్పుబోయమడగల గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలను కొన సాగిస్తూ అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. అనంతరం ఇంటిం టికీ తిరిగి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రా లను పంపిణీ చేయడంతో పాటు సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలంటూ అధికారులకు సూచించారు. కార్యక్ర మంలో టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన రావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, వైస్ ఎంపీపీ దేవనబోయిన మధు, నాయకులు చంద్ర వెంకయ్య, గుంటుపల్లి నాగభూషణం, పేరం సుధాకర్‌రెడ్డి, గుర్రం గోపి, పోకా మహేష్, ఆరికొండ వెంకటరత్నం, పొద మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. ఇటీవల కాంచెరువులో గొట్టిగుండాల శ్రీనివాసులు మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఆయన సోమవారం నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న మరో కార్యకర్త నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, చంద్ర వెంకయ్య, దేవనబోయిన మధు, పోకా మహేష్, పొద మాధవరావు, గుంటుపల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు సూచించారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ డెంగ్యూ మాసోత్సవంలో ఆయన మాట్లాడుతూ దోమల వలన వ్యాప్తించే వ్యాధి కావడంతో వాటి ఉత్పత్తిని నియంత్రించాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజశేఖరరాజు, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, శ్రీరామరాజు, నరసింహారెడ్డి, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

కలువాయి నుంచి శ్రీశైలానికి బస్సు ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ చైర్మన్, డీఎంలకు వినతిపత్రం ఇస్తున్న కలువాయి వాసులు

కలువాయి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కలువాయి నుంచి శ్రీశైలంకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, డీఎం మురళీకృష్ణలకు సోమవారం మండల వాసులు ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్ మోడిపోయిన కృష్ణయ్య, అరిబోయిన సుందరయ్య యాదవ్, తురక రమణయ్యలు జనసేన నాయకుడు నూనె మల్లిఖార్జున యాదవ్ ద్వారా వినతిపత్రం అందజేశారు. దీంతో త్వరలోనే బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. నెల్లూరు నుంచి ఉదయం బయలుదేరి పొదలకూరు, ఆదూరుపల్లి, కలువాయి, సోమశిల, అనంతసాగరం, మర్రిపాడు మీదుగా శ్రీశైలం చేరుకునే విధంగా బస్సు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

ఆక్రమణలు తొలగించి హద్దులు చూపించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

ఉదయగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు మంజూరు చేసిన ఇంటి నివేశన స్థలాలను ఆక్రమించి అక్రమంగా జామాయిల్ సాగు చేశారని, వాటిని తొలగించి హద్దులు చూపించాలని సోమవారం పలువురు లబ్ధిదారులు టీడీపీ రాష్ట్ర మైనారిటీ నాయకుడు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో తహసీల్దారు ఎల్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదర్శ కాలనీ లేఅవుట్‌లో 1225 సర్వే నెంబర్‌లో సుమారు 40 మంది పేదలకు ప్రభుత్వం ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేసిందన్నారు. అయితే ఆ స్థలాన్ని ఓ వ్యక్తి అక్రమించి చుట్టూ కంచె వేసి జామాయిల్ సాగు చేశాడన్నారు. వాటిని తొలగించి, ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు హద్దులు చూపితే తాము నివాసాలు ఏర్పాటు చేసుకుంటామన్నారు. స్పందించిన తహసీల్దారు పరిశీలించి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

అనధికార మద్యం దుకాణాలను తొలగించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణాలను తొలగించాలని ఎమ్మార్పీ ఎస్ మండల ఇన్‌చార్జి గొల్లపల్లి మోహన్‌రావు సోమవారం తహసీల్దారు నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల యజమానులు మండలంలోని ప్రతి గ్రామంలో బెల్టుషాపులు ఏర్పాటుచేయించి విచ్చలవిడిగా విక్రయాలు సాగిస్తున్నారన్నారు. మద్యం కల్తీ చేయడంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి నాసిరకం మద్యాన్ని దిగుమతి చేసుకుని విక్రయాలు సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో అనధికార మద్యం దుకాణాలను తొలగించకుంటే జిల్లా కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. స్పందించిన తహసీల్దారు పరిశీలించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగపట్ల సింహాద్రి, బర్రె అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికుల సమ్మె



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

ఆత్మకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె ఐదవ రోజుకు చేరింది. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించి సమ్మెను కొనసాగించారు. సమ్మెకు మద్దతుగా సీపీఎం, సీఐటీయు అనుబంధ సంఘాల నేతలు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు మాట్లాడుతూ మున్సిపాల్టీ ఇంజనీరింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నాగేంద్ర, గురవయ్య, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు

మున్సిపాల్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఆగస్టు 2వ తేదీ నుంచి ఏఐటీయుసీ ఆధ్వర్యంలో తాము సమ్మెలోకి వెళతామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయుసీ) నాయకులు తెలిపారు. ఈమేరకు సోమవారం కమిషనర్ సి గంగాప్రసాద్‌కు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ (ఏఐటీయుసీ) కార్యదర్శి బి హజరత్తయ్య, ట్రెజరర్ ఎం చెంచయ్య, మున్సిపాల్టీ కార్మికుల యూనియన్ ప్రచార కార్యదర్శి డొమ్మరాజు వాసు, కుంట పెంచలయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, ఏఐటీయుసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి



ఆత్మకూరు సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఫేస్ యాప్ రద్దు చేసి, సెంటర్ నిర్వహణకు ఒక్క యాప్‌ను మాత్రమే నిర్వహించాలని కోరుతూ సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, కె రమణమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందిస్తున్న సరుకులను పోషణ ట్రాకర్, బాలసంజీవని యాప్‌ల ద్వారా ఇవ్వాలని నిర్ణయించారన్నారు. అయితే అబ్ధిదా రులు సరుకులు తీసుకోడానికి వచ్చినప్పుడు ఫోన్లు పని చేయకపోవడం, నెట్ సిగ్నల్ లేకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కావున అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి సీడీపీవో సునీలతకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆర్ సుప్రజ, హమీదా, సునీత, విజయమ్మ, మస్తానమ్మ, వాణి, వేణుకుమారి, లక్ష్మీనారాయణమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దుత్తలూరు(ఉదయగిరి), జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు మంజూరు కాగానే అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడడంతోపాటు ఓవర్‌హెడ్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పలువురు అధికారులు వారి వారి శాఖల ప్రగతిని సమావేశంలో వివరించారు. కాగా, సమావేశానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మాకొట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దారు నాగరాజు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలిగా శివపార్వతి



దుత్తలూరు (ఉదయగిరి), జూలై 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నెల్లూరు పార్లమెంటు సంస్థాగత ఎన్నికల్లో భాగంగా జిల్లా ఉపాధ్యక్షురాలిగా మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన చీదర్ల శివపార్వతిని జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు మండల బీజేపీ అధ్యక్షుడు లెక్కల వెంగళరెడ్డి సోమవారం తెలిపారు. నాపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షు రాలి పదవి అప్పగించిన బీజేపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, వంశీధర్‌రెడ్డి, మండల బీజేపీ నాయకులకు శివపార్వతి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

వరుస చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్టు

● తిరుపతిలోనూ ఇదే ముఠా దోపిడీ
● కావలి వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో పట్టపగలే వరుస చోరీలకు పాల్పడిన ముఠాను కావలి వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నగరంలో రెండురోజుల క్రితం పట్టపగలే చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలోని ఉమాకాంత్ ఇంట్లో 12 సవర్ల బంగారు నగలు, సోమేశ్వరి ఇంట్లో 36.75 గ్రాముల నగలు, అదే ప్రాంతంలో మరో ఇంట్లో దోపిడీకి యత్నించారు. అదే రోజు వేదాయపాలెం పోలీసుస్టేషన్ పరిధిలోని బుచ్చయ్య ఇంట్లో 50 సవర్ల బంగారు ఆభరణాలు, నగదు, వెండి దోచుకెళ్లారు. ఒకేరోజు నగరంలో వరుసగా మూడు ప్రాంతాల్లో చోరీలు, ఓ ఇంట్లో దోపిడీయత్నం జరగడం జిల్లావ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ క్రమంలోనే జిల్లాలో జరిగిన చోరీల గురించి తెలుసుకున్న తిరుపతి జిల్లా పోలీసులు ఇదే కోవలో తమ జిల్లాలోనూ చోరీలు జరిగాయని ఇక్కడ పోలీసు అధికారులతో చర్చించారు. దీంతో అప్రమత్తమైన నెల్లూరు, తిరుపతి పోలీసులు నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో తిరుపతి పోలీసులు నెల్లూరులో దొరికిన సీసీ ఫుటేజీల ఆధారంగా నలుగురు నిందితులను కావలి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఎవరూ లేని సమయంలో ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైం), జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని కొత్తూరు ఎంజీబీ లేవుట్‌లో ప్రభుత్వ ఉద్యోగి వెంగయ్య-లక్ష్మీ దంపతులు నివాసం ఉంటున్నారు. వారి ముగ్గురు కుమారులు చదువుల నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. లక్ష్మి ఇటీవల తన పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 19న వెంగయ్య పొదలకూరులోని ఆఫీసుకు వెళ్లారు. అక్కడ నుంచి తన స్వగ్రామమైన చిలకలమర్రికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 44గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. 20వ తేదీ సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన పక్కింటివారు వెంగయ్యకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో ఆయన నగరానికి చేరుకున్నారు. చోరీ ఘటనపై సోమవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు ఏడుగురికి గాయాలు



డివైడర్‌పైకి ఎక్కిన కారు

సంగం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను కారు ఢీకొనడంతో ఏడుగురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని సిద్దీపురం ముంబాయి జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న కారు వేగంగా వెళ్తూ మార్గమధ్యంలో వెంగారెడ్డిపాళెం క్రాస్ రోడ్డు దాటిన తరువాత సిద్దీపురం ప్రారంభం వద్ద రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు



బస్సులో నుంచి జారిపడి గాయపడిన రోశయ్య

సీతారామపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బస్సులో నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన సీతారామపురం నుంచి పోరుమామిళ్ల వెళ్ళు ఘాట్ రోడ్డులో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణప్పపేట గ్రామానికి చెందిన ఎర్రపాలెం రోశయ్య పనిమీద కడప జిల్లా పోరుమామిళ్ళకు బద్వేలు డిపో ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. బస్సులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఫుట్‌పాత్‌పై నిలబడ్డాడు. బస్సు ఘాట్ రోడ్ మార్గంలో మలుపు తిరుగుతుండగా రోశయ్య ఫుట్‌పాత్‌పై నుంచి జారి రోడ్డుపై తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి ప్రయాణికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో పోరుమామిళ్ళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి...



చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు

ఉదయగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణ శివారు ప్రాంతమైన విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపాన గల 167-బీజీ జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకొంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు స్కూటీపై దుత్తలూరు వైపు వెళుతున్నాడు. అలాగే దుత్తలూరు నుంచి విజయ్ అనే వ్యక్తి తన మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వస్తున్నాడు. ఈ తరుణంలో సబ్‌స్టేషన్ వద్దకు రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈప్రమాదంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని ఇతర ప్రాంతాలకు తరలించారు. పోలీసులు వైద్యశాలకు చేరుకుని వివరాలు సేకరించారు.

'సోమశిల'కు 3,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం జూలై 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి సోమవారం 3,055 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 27.616 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 400, పెన్నా డెల్టాకు 4,300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

చిన్నారుల ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరం

ఆత్మకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 520

గ్రామాల్లో బెల్టు షాపులు ఎత్తివేయాలని వినతి

కావలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక, ఆరోగ్యాలపై ప్రభావం చూపుతున్న మద్యం బెల్టు షాపులను ఎత్తి వేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో ఎం. వంశీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. మల్లి మాట్లాడుతూ కావలి డివిజన్‌లో మద్యం దుకాణాలు పాడుకున్నవారు గ్రామాల్లో డిపాజిట్లు కట్టించుకుని బెల్టుషాపులు ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. కొన్ని గ్రామాల్లో బెల్టు షాపులకు వేలం పాటలు కూడా పెట్టి వాటిని దక్కించుకున్నారని చెప్పారు. ప్రతి దుకాణం పక్కన ఉన్న కూల్‌డ్రింక్ షాపులలో కూల్ డ్రింక్స్ కన్నా మద్యం బాటిళ్లే ఎక్కువగా దొరుకుతున్నాయన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులను ఎత్తి వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి బాధ్యులు బాపట్ల సత్యవతి, కొండమ్మ, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైసీపీ విస్తృతస్థాయి సమావేశం

దగదర్తి(బిట్రగుంట), జూలై 21(ఆంధ్రజ్యోతి): దగదర్తిలో వైసీపీ మండల కన్వీనర్ వెల్లినేని మహేష్‌నాయుడు ఆధ్వర్యంలో పార్టీ విస్తృత సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి శేఖర్‌నాయుడు, చింతలబోయిన వెంకటేశ్వర్లు, పీ.అనిల్‌రెడ్డి, సీహెచ్.వరుణ్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, ఆత్మకూరు గిరినాయుడు, ఎల్వీ ప్రసాద్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ నేత్రదానం


మెతుకు అలకానంద (ఫైల్)

కావలి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురంకు చెందిన మెతుకు అలకానంద (59) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేయడానికి కావలి రెడ్ క్రాస్ సభ్యుడు ఏజే మల్లేశ్వరరావు ప్రేరణతో ఆమె భర్త మెతుకు కోటయ్య అంగీకరించారు. దీంతో కార్నియాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నికల్ సునీల్ సేకరించారు. కుటుంబ సభ్యులకు నేత్రదాన ప్రశంసా పత్రాన్ని అందచేశారు. ఇది కావలి రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 138వ నేత్రదానమని రెడ్‌క్రాస్ ఛైర్మన్ డీ. రవిప్రకాష్, నేత్రదాన విభాగం పర్యవేక్షకురాలు ఇలింద్ర శ్రీవాణి తెలిపారు.

510 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 633 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 510 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-97, ఆర్ఆర్-5, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-9 కారణాలతో 123 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.210.58గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

పీజీఆర్ఎస్‌కి ఒకే వినతి

కొండాపురం, జూలై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ఒక వినతి అందినట్లు తహసీల్దారు కోటేశ్వరరావు తెలిపారు. గొట్టిగుండాలలో పొలాలకు వెళ్లే దారి ఆక్రమణకు గురైందని, సర్వే చేసి హద్దులు తేల్చాలంటూ రైతులు వినతిపత్రం అందచేశారన్నారు. ఈ సమస్య పరిష్కారం కొరకు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారికి ఆదేశాలిచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణరావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

బిట్రగుంట, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని కాంద్ర యువనేస్తం వ్యవస్థాపకుడు సతీష్‌నాయుడు అన్నారు. బోగోలు మండలం నాగులవరంలో వెలసి ఉన్న గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరుకు చెందిన ఏనుగుల డేనియల్ రెడ్డి శ్రీదేవమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు అందచేసిన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంద్ర రామసుబ్బానాయుడు, రఘురామ్ నాయుడు, మల్లికార్జున నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్, వేణుగోపాల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే...

దగదర్తి(బిట్రగుంట) జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే సుపరిపాలన తొలిఅడుగుతో మీముందుకు వస్తున్నామని ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు అన్నారు. దగదర్తి మండలంలోని మాలేపాటి స్వగృహంలో మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజలు స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రైతు నాయకులు సుధాకర్ నాయుడు, కంచర్ల కృష్ణ, ముప్పాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ దరఖాస్తుకు రేపటి వరకు గడువు

కలిగిరి, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 23వ తేదీ వరకు గడువు ఉందని తహసీల్దారు గిరీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని రైతులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు, 1బి, అడంగల్ కాపీలను సమీప సచివాలయం లేదా తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

కందుకూరు ఏఎంసీ, మాలకొండ ఆలయ కమిటీల

నియామకం ఎప్పుడో?

» పెరుగుతున్న ఆశావహులు » కొలిక్కి రాని నామినేటెడ్ పదవుల ప్రక్రియ » రిజర్వేషన్ మార్పు కారణంగానే జాప్యమా?



కందుకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవుల నియామకం ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్నా కందుకూరు నియోజకవర్గంలో ఉన్న రెండు ప్రధాన పాలక మండళ్ల వ్యవహారం కొలిక్కిరాకపోవడం చర్చనీయాంశమైంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)ల పాలక మండళ్లకు ఇప్పటికే మూడు జాబితాలు విడుదలైనా అందులో కందుకూరు లేకపోవడమే కాక ఐదారు నెలల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లి ఉన్న మాలకొండ దేవస్థానం పాలకమండలిని కూడా ప్రభుత్వం ప్రకటించకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతోన్నాయి. మాలకొండ దేవస్థానం పాలకమండలి పదవిని వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లోని పలువురు టీడీపీ సీనియర్ నాయకులతో పాటు కందుకూరు పట్టణానికి చెందిన పలువురు ఆశించినప్పటికీ బీసీ సామాజిక వర్గానికి ఆ పదవిని కేటాయించాలని నిర్ణయించిన నాయకత్వం వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి

● రిజర్వేషన్ మార్పుకోసమే ఆలస్యం?

చెందిన ప్రగడ నరసింహం పేరును సిఫార్సు చేస్తూ మిగితా కమిటీ సభ్యుల జాబితాతో ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తోంది. అయినా ఆ పాలకవర్గానికి జీవో విడుదల కాలేదు. అలాగే జిల్లాలోని అన్ని ఏఎంసీలకు పాలకవర్గాలను ప్రకటించినప్పటికీ కందుకూరు మాత్రం ఆ జాబితాలో లేకపోవటం చర్చనీయాంశంగా మారింది.

కందుకూరు ఏఎంసీ ఛైర్మన్ రిజర్వేషన్‌ను మార్పు చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పట్టుబడుతుండటమే పాలకవర్గం ప్రకటించకుండా జాప్యం జరగుతుండటానికి కారణంగా స్థానికులు భావిస్తున్నారు. కందుకూరు ఏఎంసీ ఎస్సీ (మహిళ)కు రిజర్వ్ అయ్యింది. అయితే ఈ రిజర్వేషన్ గత వైసీపీ ప్రభుత్వంలో చేసినది కావడంతో దానిని మార్పు చేయాలని కోరుతుండటంతో దీనిపై నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం జరుగుతుందని పార్టీ శ్రేణులు అంటున్నారు. ఈ పదవి కోసం గత ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన పలువురు నేతలు ఆశిస్తూ గత ఏడాది కాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ మండల అధ్యక్షుడు నార్నె రోశయ్యలతో పాటు పలువురు సీనియర్ నేతలు ఉన్నారు. అయితే ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యి ఉండడం, పదవి ఆశిస్తున్న వారంతా ఓసీ సామాజిక


మాలకొండ ఆలయ ముఖద్వారం

వర్గంకు చెందిన వారు కావడంతో ఈ పదవి ఎవరిని వరిస్తుందోనన్న సందేహాలు వ్యక్తమవుతోన్నా యి. ఎస్సీ రిజర్వేషన్‌కు అనుగుణంగా కొన్ని పేర్లను కూడా ప్రతిపాదిస్తూ సిఫార్సు చేసి ఉన్నప్పటికీ ఎస్సీ మహిళ రిజర్వేషన్ గత ప్రభుత్వం చేసినది అయినందున దానిని మార్చాలని కోరుతుండటంతో దీనిపై సస్పెన్స్ నెలకొంది. ప్రస్తుతం జిల్లా అంతా పాలకమండళ్లను ప్రకటించినప్పటికీ ఆ జాబితాలో కందుకూరు లేకపోవటంతో రిజర్వేష న్ మార్పు జరుగుతుందన్న ఆశాభావం ఆపార్టీ నాయకుల్లో ఏర్పడింది. పదవిని ఆశిస్తున్న వారిలో దామా మల్లేశ్వరరావు ఇటీవల తిరిగి పార్టీ పదవి చేపట్టేందుకు అంగీకరించగా రూరల్ మం డల అధ్యక్షుడుగా ఉన్న నార్నె రోశయ్య మాత్రం అవకాశం వస్తే పదవి తీసుకుంటాను లేకుంటే పార్టీకోసం స్వచ్ఛందంగా పనిచేస్తాను తప్ప తనకు పార్టీ పదవి వద్దని, రూరల్ మండల అధ్యక్షుడిగా మరొకరికి అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో కందుకూరు ఏఎంసీ రిజర్వేషన్ మార్పు జరిగితే ఆపదవి నార్నె రోశయ్యను వరించడం ఖాయమని అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వంలో చేసిన రిజర్వేషన్‌ను మార్చాలన్న వాదన కూడా బలంగా వినిపిస్తున్నందున మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : ఎంపీ

● రూ.6.2 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, తదితరులు

కావలిరూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలసి మండలంలోని చలంచర్లలో పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గుర్రం సునీల్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సుపరిపాలనతో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో రూ.6.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ కావలికి బాగా పనిచేసే ఎమ్మెల్యే దొరికడం ప్రజల అదృష్టమన్నారు. అలాగే దగదర్తి ఏయిర్ పోర్టు సత్వర నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ కావలి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. రానున్న రెండేళ్లలో మండలంలోని ప్రతి మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తానన్నారు. గౌరవరంలో భూగర్భ డ్రైనేజ్ పనులు జరుగుతు న్నాయని, అవి పూర్తి కాగానే ప్రతి గ్రామంలో భూగర్భ డ్రైనేజ్‌కు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్ర కాష్, పీఆర్ ఈఈ వేణుగోపాల్, డీఈ శ్రీనివాసులు, ఏఈలు సతీష్, సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఎమ్పీడీవో శ్రీదేవి, టీడీపీ రూరల్ మండల అ ధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, నాయకులు ఉప్పాల వెంకట్రావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, కండ్లగుంట మధుబాబు నాయుడు పాల్గొన్నారు.

● నార్తుమోపూరులో...

అల్లూరు : కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొని అభివృద్ధివైపు పరుగులు పెడుతుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నార్తుమోపూరులో ఆయన ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేబాల శంకర్‌రెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, ఊటు శ్రీకాంత్ రెడ్డి, ఎందేటి హరికృష్ణ, కప్పిరి విష్ణు, ఏలూరు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అల్లూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో సోమవారం రాత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరాపై అధికారులను వివరణ కోరగా వారు తెలిపిన వివరాలకు స్థానికులు తెలిపిన సమస్యలకు పొంతన లేకపోవడంతో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కొద్దిపాటి వర్షానికే నీరు నిల్వ


కొండబిట్రగుంట గిరిజనకాలనీలో వర్షపు నీరు

బిట్రగుంట, జూలై 21(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఆదివారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురవడంతో సోమవారం పలు చోట్ల వర్షపు నీరు నిల్వ చేరింది. అభివృద్ధి పేరుతో గ్రామాల్లో ఇష్టాను సారంగా వేసిన సీసీ రోడ్ల కారణంగా వర్షపు నీరు వెళ్లే అవకాశం లేక ఈ పరిస్థితి నెలకొంది. కొండబిట్రగుంట గిరిజన కాలనీలో రోడ్లపైనే కాకుండా ఇళ్ల ఆవరణలో నీరు నిల్వ చేరడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. సైడు కాలువలు తీసి గిరిజన కాలనీ వాసులను ఆదుకోవాలని కోరారు.

బీసీ బాలుర వసతి గృహంలో వైద్యశిబిరం

లింగసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ విద్యావతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, చిన్న చిన్న వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎంఎల్‌హెచ్‌పీలు మృదుల, శ్రీహరి, ఖాసింబాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి


సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న పెంచలయ్య

కావలి(టౌన్), జూలై 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులను ఏజెన్సీలకు అప్పగించ కుండా పర్మినెంట్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య కోరారు. సోమవారం 5వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పాలన్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరే కిస్తున్నామన్నారు. వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తోపాటు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు చట్టబద్ధమైన సెలవులివ్వాలని జీవో 36 ప్రకారం జీతాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం పోలయ్య, ఎస్‌కె షాన్‌వాజ్, యూనియన్ నాయకులు టీ శీనయ్య, రమేష్, మహేష్, చిన్నమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


కరపత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

ఉలవపాడు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అండగా ఉంటానని, తప్పుదారి పట్టించే వారి మాటలు నమ్మవద్దని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం సాయంత్రం మండలంలోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీ, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలలో ఆయన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగే అభివృద్ధిని ఓర్వలేని కొందరు అమాయక ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం కరేడులో భూసేకరణ చేపట్టనుందని, అభివృద్ధిని ఓర్వలేని కొందరు అమాయక ప్రజల్లో భయాందోళనలు పుట్టిస్తున్నారని, అలాంటి వారి మాటలు నమ్మొద్దన్నారు. రామకృష్ణాపురం, ఉప్పరపాలెం భూసేకరణలో భాగంగా తొలగించబడతాయన్నారు. ఆ రెండు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద జాతీయ రహదారికి ఆనుకొని 5 సెంట్ల భూమిలో పక్కా గృహాలు నిర్మించి ఇస్తారని అందుకు తనదే బాధ్యతన్నారు. ఆ ఇళ్లలోకి చేరిన తరువాతే ఉన్న గ్రామాలను ఖాళీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే అందరం కలిసి మాట్లాడుకొని ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని రామకృష్ణాపురం ఎస్టీలు చెప్పగా, ఉప్పరపాలెం గ్రామస్థులు గ్రామం ఖాళీ చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆదాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30న పారా అథ్లెటిక్స్ పోటీలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాల్యాద్రి

కావలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): జూనియర్స్, సబ్‌జూనియర్స్ విభాగాల్లో పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఈనెల 30వ తేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగుతాయని పారా క్రీడల కమిటీ జిల్లా అధ్యక్షుడు టీసీ మాల్యాద్రినాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని భవిత పాఠశాలలో దివ్యాంగులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగ క్రీడాకారులందరూ ఈ పోటీలకు హాజరు కావాలని కోరారు. జిల్లాస్థాయిలో జరిగే క్రీడల్లో అర్హత సాధించిన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలకు, రాష్ట్రస్థాయి అర్హత సాధించిన వారిని జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక చేస్తామన్నారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు ఉద్యోగాలలో మూడు శాతం రిజర్వేషన్‌ను కూటమి ప్రభుత్వం కల్పించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. క్రీడలకు హాజరయ్యే విద్యార్థులు దివ్యాంగుల సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫొటోతో సొంత ఖర్చులతో వచ్చి ఈనెల 30న ఉదయం 9 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలన్నారు.

చుక్కల భూమి సమస్య పరిష్కరించండి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కచ్చేరిమిట్ట బాధితులు

కావలి(టౌన్), జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కచ్చేరిమిట్టలో చుక్కల భూమి సమస్య పరిష్కరించాలని బాధితులు సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అంజేశారు. వారు మాట్లాడుతూ తమ ఇళ్ల స్థలాలు, ఇళ్లు చుక్కల భూముల కింద ఉండడంతో రిజిస్ట్రేషన్‌లు జరగడంలేదని, బ్యాంకు రుణాలు ఇవ్వడంలేదని, క్రయ విక్రయాలు కష్టతరంగా మారాయన్నారు. 70 ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో నివశిస్తున్నామని, 2016 వరకు రిజిస్ట్రేషన్‌లు జరగడంతో పాటు బ్యాంక్ రుణాలు కూడా పొందామన్నారు. 2016 నుంచి చుక్కల భూమి నెపంతో రిజిస్ట్రేషన్‌లు జరగడంలేదని, దీంతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దిలీప్‌కుమార్, బాధితులు రతన్‌ప్రసాద్, ఈదూరు జైపాల్, ఇమ్మానియేల్, తాతపూడి ప్రసాద్, సందేశ్, కొణిదల మార్క్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై అవగాహన


సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వార్డు సచివాలయాల పారిశుధ్య విభాగం సిబ్బంది

కందుకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే దుష్ప్రభావాలు, ప్లాస్టిక్ వినియోగంను ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా బహిష్కరించాల్సిన ఆవశ్యకతపై స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాల పారిశుధ్య విభాగం సిబ్బంది విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వలన పర్యావరణానికి పొంచిఉన్న ముప్పును వివరించారు. విద్యార్థులంతా ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటంతో పాటు తల్లిదండ్రులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలని కోరారు.



మండలంలో తాగునీటి సమస్యలు లేవు

● సీహెచ్ రాజశేఖర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ముఖాముఖి

లింగసముద్రం, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో 10 అడుగుల నీటిమట్టం ఉన్నందున 2026 జనవరి వరకు మండలంలో తాగునీటికి ఎ లాంటి ఇబ్బందులు ఉండవు. ఈ ప్రాజెక్టు ఆధారంగా గుడ్లూరు, రాళ్లపాడు-రేళ్లపాడు, చుండి-చెర్లోపాలెం పథకాల ద్వారా 38 గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్ తెలిపారు.

? మండలంలో తాగునీటి సరఫరా ఎలా జరుగుతోంది.

! రాళ్లపాడు ప్రాజెక్టు ఆధారంగా పనిచేసే మూడు భారీ మంచి నీటి పథకాల ద్వారా 38 గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోంది.

? వర్షాలు కురవకపోతే ప్రాజెక్టులో నీరు ఎన్ని నెలలకు వస్తుంది.

! ఇప్పుడు వర్షాలు కురవకపోయినా వచ్చే ఏడాది జనవరి నెల వరకు ప్రాజెక్టులోని నీరు సరఫరా చేయవచ్చు.

? మంచినీటి పథకాల నిర్వహణకు అవసరమైన సిబ్బంది ఉన్నారా.

! మంచినీటి పథకాల నిర్వహణకు సిబ్బంది కొరత లేదు. ఎక్కడైనా సమస్య వస్తే ఒక్కరోజులో పరిష్కరిస్తున్నాం.

? గ్రామాల్లో ఎన్ని చేతిపంపులు ఉన్నాయి. వాటి పరిస్థితి ఏమిటి.

! మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో సుమారు 400 చేతి పంపులు ఉన్నాయి. వీటిలో 10 పని చేయడం లేదు.

'యాక్సిస్' టోకరాలో ఆ నలుగురు

(5వ పేజీ తరువాయి)

ఫిబ్రవరి 2022, జనవరి 2024 మధ్య కాలంలో చోటుచేసుకుంది. ఆపై కొద్ది నెలల పాటు రుణాల ఈఎంఐ కింద రూ.కోటి41 లక్షల నగదు చెల్లించారు. ఆపై అడ్రస్ లేకుండా వెళ్లిపోయారు. రుణాలన్నీ డిజిటల్‌గా తీసుకోవడంతో ఆయా ఖాతాదారులకు రుణాల సంగతి తెలియకపోవడం గమనార్హం. రుణా ల బకాయిలు పేరుకుపోవడంతో నెల్లూరు నగర యాక్సిస్ బ్యాంకు మేనేజర్ మన్నేపల్లి మదన్మోహన్ కంపెనీ ఖాతాలు ఉన్న ముత్తు కూరు పరిధి పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది డి సెంబరు 23న ఫిర్యాదు చేశారు. తమ బ్యాంకును వాసుదేవనాయుడు, అల్లాబక్షు, శివ, వెంకట్‌లు 56 మందితో కలిసి నకిలీ పత్రాలు దాఖలు చేసి ఉద్దేశపూర్వకంగా రుణాల పేరుతో రూ.9.20 కోట్లు స్వాహా చేసి మోసం చేశారని ఆ ఫిర్యాదులో తెలిపారు. అప్పట్లో విచారించి కేసు రిజిస్టర్ చేసిన పోలీసులు 56 ఖాతాలను సంబంధించి దాఖలు చేసిన ధ్రువపత్రాలు, ముత్తుకూరు బ్యాంకులోని నాలుగు కంపెనీ ఖాతాల వివరాలు అందజేయాలని, బ్యాంక్ అధికారులకు లిఖితపూర్వకంగా కోరారు. అయితే, ఎందుకనో ఈ కేసు దర్యాప్తులో పురోగతి కనిపించలేదు. తాజాగా నాలుగు రోజుల కిందట యాక్సిస్ బ్యాంకు నుంచి అసలైన ఖాతాదారులకు రుణాలు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామంటూ నోటీసులు జారీ అయ్యాయి. అసలు రుణాలు ఏమిటి.. ఎవరు ఇచ్చారో తెలియని కొందరు ఖాతాదారులు నెల్లూరులోని గిరిజన సంక్షేమ సంఘాన్ని ఆశ్రయించడంతో గుట్టు రట్టయింది.

అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అనుమతి

● ఉత్తర్వులు జారీ చేసిన వ్యవసాయ వర్సిటీ

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిప్లొమో కోర్సులో ప్రవేశాలకు అనుమతిస్తూ ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కారణాలతో తిరుపతి వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న అగ్రికల్చర్ డిప్లొమో కోర్సులో ప్రవేశానికి అనుమతి నిరాకరించారు. అయితే పలువురి విజ్ఞప్తి మేరకు ప్రవేశాలకు అనుమతించారు. ఈనెల 25వ తేదీకి వెబ్ ఆప్షన్ల నమోదుకు చివరి గడువుగా విధించినట్టు ప్రిన్సిపాల్ సుమతి చెప్పారు.

మేఘమాల



పచ్చని గుట్టలు.. చల్లని గాలులు.. నీలాకాశం మీద తేలాడుతూ వచ్చిన తెల్లని మబ్బులు.. తిరుమల ఆలయం వెనుక వాలి సేదదీరుతూ భక్తులకు కనువిందు చేశాయి. అఖిలాండం వద్ద నుంచి చూస్తే శ్రీవారి ఆలయానికి ప్రకృతి వేసిన శ్వేతమేఘమాలలా కనిపించింది. పలువురు ఈ దృశ్య నేపథ్యంగా ఫొటోలు దిగారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి





నట కెరటం

ఆకలితీర్చుకోవడం కోసం రిక్షా తొక్కాడు. అంచెలంచెలుగా ఎదిగి విమానమూ ఎక్కాడు. ఇటుకలెత్తిన ఇంటికే అతిథిగా వెళ్లాడు. చింతామణి సుబ్బిశెట్టిగా గిలిగింతలు పెట్టాడు. ఉత్తర కుమార పాత్రలో చిచ్చరపిడుగు అనిపించుకున్నాడు. ఆయన నటనాచతురతకు మురిసిన 'బంగారు' నంది గుప్పెట్లో వాలింది. ఒక్కడే వంద నాటక సమాజాలను ఒక్క చోట కలుపుతాడు. ఒక్కడే హనుమ నాటకోత్సవ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తాడు. ఈ క్రమంలో ప్రశంసొచ్చినా, విమర్శొచ్చినా ఒక్కడికే. ఆయనే అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బి.నారాయణ రెడ్డి. అందరూ ఆయనను బి.ఎన్.రెడ్డి అనీ, బీఎన్ఆర్ అనీ ఆత్మీయంగా పిలుస్తారు. అభినయ ఆర్ట్స్ రజతోత్సవ వేడుకలు మహతి ఆడిటోరియంలో జరుగుతున్న వేళ బీఎన్.రెడ్డితో ఆంధ్రజ్యోతి సంభాషణ...

6

నేడు టీటీడీ బోర్డు సమావేశం

● 45 అంశాలతో అజెండా



తిరుమల, జూలై21(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం జరుగనుంది. తిరుమల అన్నమయ్య భవనంలో ఉదయం 10.30 గంటలకు చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సభ్యులు సమావేశం కానున్నారు. దాదాపు 45 అంశాలతో రూపొందించిన అజెండాపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ఇందులో ప్రధానంగా టీటీడీలోని కాంట్రాక్ట్ డ్రైవర్లను, విద్యాసంస్థల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడం, తిరుమలలోని పాత భవనాలను నూతన డోనార్ స్కీం కింద పునర్నిర్మించే అంశం, వేదపారాయణదారులకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు అందజేసే అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. అలాగే బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా చర్చ జరగనుంది. శ్రీవాణి ట్రస్టు ద్వారా వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల అంశంపై కూడా చర్చించి నిర్ణయాలు తీసుకోన్నారు. టీటీడీలో అన్యమత ఉద్యోగుల అంశం ఇటీవల తీవ్రస్థాయిలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.టీటీడీలో దాదాపు వెయ్యి మంది అన్యమత ఉద్యోగులు ఉన్నారంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్ వ్యాఖ్యానించడం కలకలం సృష్టిస్తోంది. ఇప్పటికే టీటీడీ ఐదుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు మరికొందరిపై విజిలెన్స్ విభాగంతో విచారణ చేయిస్తోంది. అయితే పూర్తిస్థాయిలో టీటీడీ నుంచి అన్యమత ఉద్యోగుల తొలగింపుపై మరోమారు చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. అలాగే టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగుల ఇళ్లను విజిలెన్స్ ద్వారా తనిఖీ చేయించి అన్యమతస్తులను గుర్తించేలా బోర్డు తీర్మానం చేస్తామంటూ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్‌రెడ్డి ప్రకటన చేశారు. దీనిపై కూడా చర్చ జరగనున్నట్టు తెలిసింది.

అధికారులపై చైర్మన్ అసహనం

ఇప్పటివరకు బోర్డులో చేసిన తీర్మానాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ టీటీడీ బోర్డు చైర్మన్ అధికారులుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తిరుమలలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం జరుగనున్న నేపథ్యంలో సోమవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్‌తో పాటు ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నూతనంగా పెట్టబోయే అజెండా అంశాలపై చర్చిస్తున్న క్రమంలో ఇప్పటికే తీర్మానం చేసిన వాటి అమలులో ఎందుకు ఆలస్యం చేస్తున్నారంటూ ఈవోపై చైర్మన్ ఆగ్రహించినట్లు తెలిసింది. వ్యక్తిగత అజెండాలు ఎవరికి లేవనీ, పరిపాలనపరంగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తూ అన్నిటిని ఒక్కొక్కటిగా అమలుచేస్తూ వస్తున్నామని ఈవో కూడా బదులిచ్చినట్లు సమాచారం. కొంతసమయానికే అందరు సర్దుకుని సమావేశాన్ని ముగించినట్లు తెలిసింది.

డీసీసీబీ విభజన!

● తిరుపతికి ఏర్పాటుకానున్న కొత్త సహకార బ్యాంకు
● చిత్తూరు బ్యాంకు పరిధిలోనే అన్నమయ్య జిల్లా శాఖలు



చిత్తూరు కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వందేళ్ళకు మించి చరిత్ర కలిగి సహకార రంగంలో తన ప్రత్యేకతను చాటుకుంటున్న చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) విభజనకు లోనుకానుంది.రాష్ట్రవ్యాప్తంగా 13 డీసీసీబీలుండగా ప్రాథమికంగా చిత్తూరు, కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాల్లోని నాలుగు వెరసి ఆరు డీసీసీబీల విభజనకు ప్రభుత్వం ఆలోచిస్తోంది.తొలిదశలో ఆరు డీసీసీబీలను 12గా విభజించి, వాటి పనితీరును పరిశీలించాక మిగిలిన ఏడు డీసీసీబీలను విభజించనున్నట్లు సమాచారం.

2022 ఏప్రిల్‌లో జిల్లాల పునర్విభజన జరిగింది. కానీ అప్పట్లో డీసీసీబీ, డీసీఎంఎస్ (జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ) విభజన జరగలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోనే డీసీసీబీ, సీడీసీఎంఎస్ కొనసాగుతున్నాయి.పరిపాలనా సౌలభ్యం కోసం డీసీసీబీలను పునర్వవస్థీకరించాలని సహకారశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాకొక డీసీసీబీని ఏర్పాటు చేసే దిశగా అడుగులేస్తోంది. ప్రస్తుతం చిత్తూరులో కొనసాగుతున్న డీసీసీబీ పరిధిలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని 75 సింగిల్ విండోలు(ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు)న్నాయి, 40 బ్యాంకు శాఖలున్నాయి. తిరుపతి, అన్నమయ్య జిల్లా కేంద్రాల్లో డీసీసీబీ తరపున డీజీఎం స్థాయి అధికారులకు కార్యాలయం ఏర్పాటు చేశారు.అక్కడి కలెక్టర్లు జరిపే జిల్లా స్థాయి సమావేశాలకు ఆయా అధికారులు హాజరవుతున్నారు. ప్రస్తుత చిత్తూరు డీసీసీబీ పరిధిలో 75 సింగిల్ విండోలుండగా, జిల్లాలవారీగా చిత్తూరులో 37, తిరుపతిలో 23, అన్నమయ్యలో 15 విండోలు కొనసాగుతున్నాయి. బ్యాంకు శాఖలవారీగా చిత్తూరులో 20, తిరుపతిలో 14,అన్నమయ్యలో 6 బ్యాంకు శాఖలున్నాయి.చాలా సంవత్సరాలుగా ఎన్నికలు జరక్కపోవడంతో మొన్నటి వరకు త్రిసభ్యకమిటీలతో సింగిల్ విండోలు, సెవెన్‌మెన్ కమిటీతో డీసీసీబీ,సీడీసీఎంఎస్ కొనసాగాయి. తాజాగా ప్రభుత్వం సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలను వేయగా, డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జులను చైర్మన్లుగా నియమించింది. త్వరలో సహకార సంస్థలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉంది. డీసీసీబీలను విభజించి ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుంది, లేదా ఉమ్మడి జిల్లా డీసీసీబీలకు ఎన్నికలు జరిపి,ఆ తర్వాత విభజిస్తే ఎలా ఉంటుంది అని ప్రభుత్వం ఆలోచిస్తోంది.అయితే సహకార శాఖ ఉన్నతాధికారుల సంకేతాల ప్రకారం ఎన్నికలకు ముందే తొలి, మలిదశల్లో డీసీసీబీలను విభజించే అవకాశం ఉందని తెలుస్తోంది.

జిల్లా	బ్యాంకు శాఖలు	సింగిల్ విండోలు
చిత్తూరు	20	37
తిరుపతి	14	23
అన్నమయ్య	06	15
మొత్తం	40	75

తిరుపతి డీసీసీబీపై కసరత్తు

డీసీసీబీ విభజన జరిగితే తిరుపతి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏర్పాటుకు ఇప్పటినుంచే చర్యలు ప్రారంభిస్తే ఎన్నికల నాటికి ఒక కొలిక్కి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. అన్నమయ్య జిల్లాను మాత్రం చిత్తూరు డీసీసీబీలోనే కొనసాగించనున్నారు. విభజన జరిగితే తిరుపతి జిల్లాకు కొత్తగా అధికారులు, ఉద్యోగుల సర్దుబాట్లు, కార్యాలయ భవనాలు, సమావేశ మందిరాలు ఏర్పాటు చేయాల్సివుంటుంది. కాగా తిరుపతిలో డీసీసీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు కోసం రెండువేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించాలని ఆ జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను బ్యాంకు అధికారులు కోరినట్లు సమాచారం.

రేపు కలెక్టరేట్‌లో స్పీకర్ సమీక్ష

తిరుపతి(కలెక్టరేట్),జూలై21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా సెప్టెంబరులో జరుగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహణ ఏర్పాట్లపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షిస్తారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం సాయంత్రం 4గంటలకు ఆయన వస్తారు.


11 నుంచి బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఆగస్టు 11వ తేదీ నుంచి బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.11 నుంచి 14వ తేదీ వరకూ ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు జూలై 28వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. జ్ఞానభూమి.. వెబ్‌సైట్‌లో అప్లికేషన్ అందుబాటులో ఉంచారు.

ఆఫీసర్ వర్సెస్ అటెండర్

● రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో వివాదం
● పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదులు

రేణిగుంట జూలై 21(ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారి ఇచ్చిన ఉత్తర్వు మేరకు అటెండర్‌ను విధుల్లోకి తీసుకోకుండా సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించడంతో చెలరేగిన వివాదం పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదుల వరకు దారితీసింది. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న ఎన్.తిరుమలేశ్‌ను ఫిబ్రవరి నెలలో ఓ విచారణ నిమిత్తం డిప్యుటేషన్‌పై సత్యవేడుకు పంపారు. తనను డిప్యుటేషన్‌పై పంపడం సరికాదని ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రేనిగుంటలోనే కొనసాగించమంటూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు జిల్లా రిజిస్ట్రార్ రేణిగుంటలోనే పనిచేయాల్సిందిగా తిరుమలేశ్‌కు ఉత్తర్వులు ఇచ్చారు. విధుల్లో చేరేందుకు గత సోమవారం రేణిగుంట కార్యాలయానికి వెళ్లడంతో ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డి అంగీకరించలేదు. రోజూ కార్యాలయానికి వెళుతున్నా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయనీకపోవడంతో తిరుమలేశ్ సోమవారం ఎమ్మార్పీఎస్ నేతలతో కలసి ఎస్ఆర్ కార్యాలయానికి వెళ్లారు.ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయంపై దళిత సంఘం నాయకుడు గోపి మీడియాతో మాట్లాడుతూ అటెండరు దళితుడని లెక్కచేనితనంతో ఆనంద్ రెడ్డి వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు.'నిన్ను పనిలో పెట్టుకోను ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో..' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అవమానించారని ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ ఆనంద్ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశామన్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి మాట్లాడుతూ అటెండర్ ప్రవర్తన సరిగ్గా లేని అటెండర్ తిరుమలేశును విధుల్లో చేర్చుకోనని ఇదివరకే జిల్లా రిజిస్ట్రార్‌కు తెలిపానన్నారు. అయితే కొంతమంది దళిత సంఘ నాయకులను తీసుకువచ్చి తనపై దౌర్జన్యం చేయడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.కాగా ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో కేసులు నమోదు చేస్తే ఇబ్బందని పోలీసులు చెప్పడంతో ఇరువర్గాలూ వెనకడుగు వేసినట్టు సమాచారం. తర్వాత అక్కడ నుంచి జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్ వద్దకు పంచాయితీ మారినట్టు తెలిసింది. చివరకు వారిద్దరూ రాజీపడి ఫిర్యాదులను వెనక్కు తీసుకున్నారు. అటెండర్‌ను విధుల్లోకి తీసుకునేందుకు సబ్ రిజిస్ట్రార్ అంగీకరించినట్లు తెలిసింది.



సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న అటెండర్ తిరుమలేశ్, దళిత సంఘం నాయకులు




జస్టిస్ చంద్రకుమార్ - ఎస్.ప్రసాద్

తిరుమలలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ చంద్రకుమార్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ప్రాసిక్యూషన్స్ జిల్లా డైరెక్టర్ ఎస్.ప్రసాద్, తిరుపతి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జయశేఖర్ ఉన్నారు. కాగా దర్శనం అనంతరం మంత్రి సంధ్యారాణి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా కాపాడాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కోదండరామాలయంలో పవిత్రాల సమర్పణ

తిరుపతి అర్బన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): కోదండరామాలయంలో సోమవారం పవిత్రాల సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుతగా సీతారామలక్ష్మణుల ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కుంభారాధన, హోమం చేపట్టారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేశారు. ఈ సందర్భంగా ధ్రువమూర్తులు, కౌతుకమూర్తులు, స్నపనమూర్తులు, బలిమూర్తులకు పవిత్రాలు సమర్పించారు. అలాగే విష్వక్సేన, ద్వార పాలకులు, భాష్యకారులు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం, ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగా ఆంజనేయస్వామికి సైతం పవిత్రాలను సమర్పించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులు బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు చేపట్టారు.

సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని ఓ షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.33 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 87,138

తలనీలాలు సమర్పించినవారు: 30,099



నట కెరటం

అభినయ ఆర్ట్స్ బీఎన్ రెడ్డి

పరిషత్తు పోటీలంటే నిర్వాహకులకు పెద్ద ప్రహసనంతో కూడుకున్న పని. ఆరు నెలలపాటు అనేకమంది కలిసి మోసే భారం.. అలాంటిది ఒకే ఒక్కడు తిరుపతి వేదికగా ఒక నాటక పరిషత్తును పాతికేళ్లుగా నడిపిస్తున్నాడు. ఆ సంస్థ పేరు అభినయ ఆర్ట్స్. ఆ వ్యక్తి పేరు బీఎన్ రెడ్డి. నటన ఆయన ప్రాణం, నటన ఆయన జీవితం. నటనే ఆయన ప్రపంచం. ఆ నిత్య నటనోత్సాహి నడుపుతున్న అభినయ ఆర్ట్స్ రజతోత్సవ వేడుకలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా బీఎన్ రెడ్డి నట, జీవన యాత్ర.. ఆయన మాటల్లోనే..

తిరుపతి, ఆంధ్రజ్యోతి





దర్శకుడిగా సినిమా

దీన్ని చూసిన స్నేహితులు సినిమా చేయమని ప్రోత్సహించారు. తిరుపతి వైద్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ పార్థసారధి నిర్మాతలుగా 'నీతోనే హాయ్‌హాయ్' సినిమాను తీశాం. తెలుగుతోపాటు హిందీలో కూడా రిలీజ్ చేశాం. రెండో సినిమాకు కథను సిద్ధం చేసుకుంటున్నా.




లోహితాసుడిగా తొలి వేషం

మాది నెల్లూరు జిల్లా హసనాపురం. అమ్మానాన్నలకు ఐదుగురు సంతానం. 16 మంది మేనమామలు. ఉమ్మడి కుటుంబం. మా మేనమామలు అందరూ పౌరాణిక నాటకాలు ఆడేవారు. ఒక్కసారి ఒక నాటకంలో అన్ని పాత్రలూ మా ఇంట్లోవాళ్లే వేసేవారు. స్త్రీ పాత్రలు మాత్రం వేసేవారు కాదు. మా నాన్న రామాయణ, భారతాల గురించి చెప్పేవారు. వీరందరినీ చూస్తూనే పెరిగాను. ఒకసారి మా ఊళ్లో సత్యహరిశ్చంద్ర నాటకం వేయాలనుకున్నారు. అందులో లోహితాసుడిగా నన్ను ఎంపిక చేసుకున్నారు. నాలుగు పద్యాలు నేర్పించి స్టేజి ఎక్కించారు. ఇక అక్కడి నుంచీ నాటకం నాకో వ్యసనంగా మారింది. హార్మోనియం సౌండ్ వినిపిస్తే చాలు బడి ఎగ్గొట్టేసేవాడిని. ఇంట్లో తిడతారని దూలం మీద నక్కి కూర్చుని ఇంట్లో జరిగే రిహార్సల్స్ చూస్తూ ఉండేవాడిని. ఇంటిలో మందలించినప్పటికీ దొంగచాటుగా ఇంటి దూలం ఎక్కి ఆలకించేవాడిని.

అప్పుడెక్కిన స్టేజీ ఇంకా దిగలేదు

నా 14వ ఏట డైరెక్టర్ అయిపోయాను. ఆగస్టు 15 సందర్భంగా స్కూల్‌లో నాటిక వేయాలనుకున్నాం. మా మాస్టారు కామేశ్వరరావు నన్ను పిలిచి 'మనుషులంతా ఒక్కటే' నాటికను ఇచ్చి 'నువ్వే డైరెక్టర్ నాటకామాడించు అన్నారు. అంతే.. అప్పుడు ఎక్కిన స్టేజీ ఇప్పటికీ దిగలేదు.

రంగస్థలం కోసం రిక్షా తొక్కా

మా నాన్న చనిపోయాక కుటుంబ భారం మీద పడింది. వానొస్తేనే వ్యవసాయం. పని వెతుక్కుంటూ నెల్లూరుకు చేరుకున్నా. పగలంతా బేల్దారి కూలీ. రాత్రిళ్లు రిక్షా తొక్కేవాడిని. ఆ కష్టాన్ని ఇప్పటికీ మరవలేదు. అప్పుడూ నాటకాన్ని వదల్లేదు. ఒక మధురమైన అనుభవం ఏమిటంటే.. కూలీగా నేను ఇటుకలు మోసిన ఇంటికే పాతికేళ్ల తర్వాత అతిథిగా వెళ్లడం. అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శిగా నాటకం నాకు ఆ గౌరవం ఇచ్చింది.

ఆతిథ్యం అందుకున్నా. చేతితో గోడను నెమ్మదిగా తాకుతూ ఆనందబాష్పాలతో నిద్రపోయా. ఆరోజు నా జీవితంలో మరిచిపోలేనిది. 8ఏళ్ల క్రితం అభినయ ఆర్ట్స్ పనిమీద ప్రకాశం జిల్లాకు వెళ్లా. రాత్రి 4 గంటలకు రైలు దిగా. బయటకు రాగానే ఆటో, రిక్షాలు కనిపించాయి. నేరుగా రిక్షా వైపుకెళ్లి నేను వెళ్లాల్సిన అడ్రస్ చెప్పా. కొంతదూరం వెళ్లాక రిక్షావాలాను దిగమని, నేను ఎక్కి రిక్షా తొక్కా. అలవాటు తప్పిందా లేదా అని పరీక్షించుకున్నా. రిక్షా ప్రయాణం సవ్యంగానే సాగింది. తెల్ల దుస్తులతో రిక్షా తొక్కుతుంటే అతను ఆశ్చర్యపోయాడు. గతం చెప్పాక అతని ఆశ్చర్యానికి సమాధానం దొరికింది.

పరుచూరి ప్రోత్సాహంతో సినిమాల్లోకి..

యుక్త వయసులో సాంఘిక నాటికలు విస్తృతంగా వేసేవాళ్లం. కలియుగమా కళ్లతెరువు, నీతీ నీవెక్కడ, గుండెలు మార్చబడును, ఏక్‌దిన్‌కా సుల్తాన్, పూల రంగడు.. ఇలా ఎన్నో నాటికల్లో కీలక పాత్రలు నావే. 'హుష్‌కాకి' అనే నాటికలో లచ్చిగాడు అనే బిక్షగాడు పాత్ర వేశా. ఆ రోజు సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా వచ్చారు. నాటికలోని నాపాత్ర చూసి అభినందించి, సినీ పరిశ్రమకు రమ్మన్నారు. తొలి సినిమా అవకాశం.. డాక్టర్ భవాని చిత్రంలో. నటుడిగా ఉంటూనే ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా, మేనేజర్‌గా, కంట్రోలర్‌గానూ చేసేవాడిని. జంబలకిడిపంబ, ఇద్దరు పెళ్లాల ముద్దుల పోలీస్, ఒరేయ్ రిక్షా, ఒసేయ్ రాములమ్మ, టాప్‌హీరో, ఆ..ఒక్కటీ అడక్కు...ఇలా వంద సినిమాలకు పైగా ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేశా. దర్శకరత్న దాసరి నారాయణ రావు దగ్గర శిష్యుడిగా ఉండే అవకాశం కొంతకాలం వచ్చింది. తిరుపతి అమ్మాయిని పెళ్లి చేసుకోవడంతో తిరుపతికి వచ్చేశా. ఆ సమయంలోనే గురువు దివంగత డాక్టర్ ఎన్.శివప్రసాద్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆయన దగ్గర పనిచేసే అవకాశం వచ్చింది.

అభినయ ఆర్ట్స్ ప్రస్థానం

సినిమా పరిశ్రమ హైదరాబాద్‌కు మారిన తర్వాత అక్కడ ఇమడలేక తిరుపతికి తిరిగి వచ్చేసి అభినయ ఆర్ట్స్‌ను స్థాపించా. ఒక రోజు కార్యక్రమాలతో మొదలుపెట్టి.. నేడు 9 రోజులపాటు జాతీయ స్థాయి నాటకోత్సవాలను నిర్వహించే దాకా ఎదిగింది. రూ.14వేలతో మొదలుపెట్టిన కార్యక్రమం నేడు పాతిక లక్షలకు చేరింది. ఇదంతా నా వెన్నంటి ఉండే చిరకాల దాతలు, మిత్రుల సహకారం. ముఖ్యంగా నాభార్య యమున.. అతిథులు, కళాకారులకు కడుపునిండా అన్నంపెట్టి పంపుతుంది. కుటుంబ సభ్యులందరూ పనులన్నీ పక్కనపెట్టి పదిరోజుల పాటు మహతిలో కష్టపడతారు. ఆరునెలల పాటు అభినయ ఆర్ట్స్ పనిలోనే ఉంటా.



రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు అందుకుంటున్న బీఎన్ రెడ్డి



గరుడ నాటకోత్సవాలలో ఉత్తమ హాస్యనటుడిగా నూతన ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు

నంది అవార్డు

అభినయ ఆర్ట్స్ స్థాపించాక వేషాలు వేయడం తగ్గిపోయింది. గరుడ నాటకోత్సవంలో శ్రీకృష్ణతులాభారంలో వసంతకుడిగా నటించి ఉత్తమ హాస్యనటుడి అవార్డు దక్కించుకున్నా. రాష్ట్ర ప్రభుత్వ నంది నాటకోత్సవాలలో విరాట్ పాండవీయంలో ఉత్తర కుమారుడు పాత్రకు బంగారు నంది అందుకున్నా. ఏపీ పోలీస్ శాఖ కోసం ఎర్రచందనం అక్రమ రవాణాను నిరోధించడంపై 'మనసంపద' పేరుతో షార్ట్‌ఫిల్మ్ తీశా. ఇందులో విలన్ పాత్ర చేశా.

భూ సమస్యలకు పరిష్కారమెప్పుడు?

● రెవెన్యూ శాఖకు పోటెత్తుతున్న అర్జీలు ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 329 వినతులు




అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీశుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 21(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు భూ సమస్యలు పట్టించుకోవడంలేదంటూ జిల్లాలోని పలు మండలాల నుంచి వచ్చిన అర్జీదారులు జిల్లా అధికారుల వద్ద ఏకరువు పెట్టారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. వచ్చిన వినతుల్లో 80 శాతం రెవెన్యూ శాఖపైనే అందడం గమనార్హం. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 329 ఫిర్యాదులు అందగా అందులో 165 రెవెన్యూ శాఖకే రావడం గమనార్హం.

భూమిని కబ్జా చేశారు.. న్యాయం చేయండి



అయ్యా.. నాకు పసుపు, కుంకుమ కింద వచ్చిన భూమిని, నా తమ్ముడికి చెందిన భూమిని కేశవరావు అనే వ్యక్తి ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నాడు. భూమిలోకి అడుగుపెట్టనివ్వడంలేదు. ఇప్పటికే పలుమార్లు అర్జీ ఇచ్చాం. మా సమస్యను పరిష్కరించలేదు. తహసీల్దారు వచ్చి చూశారే తప్పా న్యాయం చేయలేదు. మా వద్ద ఉన్న డాక్యుమెంట్స్ చూసి స్థలాన్ని ఇప్పించి న్యాయం చేయండి.

- బత్తెమ్మ, పాంచాలినగర్, రేణిగుంట

చిరు వ్యాపారులకు స్థలం కేటాయించండి



'జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వీధి వ్యాపారులను ఖాళీ చేయమంటున్నారు.. వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వ భూమిని కేటాయించండి' అంటూ తడ మండలం తడ కండ్రిగ గ్రామ పంచాయతీ వారు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు విన్నవించారు.

నడవలేని స్థితిలో ఉన్నా పింఛను మంజూరు చేయండి

సార్! మాది పుత్తూరు ఎన్జీవో కాలనీ. కూలి పనులు చేసుకుంటే కానీ కుటుంబం గడవదు. నా భర్త మరణించాడు. పిల్లలు కూడా ఎవరూ లేరు. అనారోగ్యం కారణంగా ఒక కాలు తొలగించారు. నడవలేని స్థితిలో ఉన్నాను. జీవితం గడవడం చాలా కష్టంగా ఉంది. వికలత్వ పింఛను ఇచ్చి ఆదుకోండి.

- జ్ఞానమ్మ, పుత్తూరు



మా గుడి మాకు కట్టించండి

'దామినేడు గ్రామదేవత నాగాలమ్మ పుట్ట ఉన్న ఆలయ పరిసరాలను కృష్ణమూర్తినాయుడు గత నెల 15న అర్ధరాత్రి కూల్చివేశాడు. దీనిపై తాము ఆందోళన చేయగా సాక్షాత్తు ఆర్డీవో రామ్మోహన్, అధికార పార్టీ నాయకులు ఎదుట సదరు కృష్ణమూర్తినాయుడు, అతని కుమారుడు పద్మాకర్ తిరిగి కట్టిస్తామని చెప్పారు. నెల కావస్తున్నా ఇంతవరకు పట్టించుకోలేదు..' అంటూ కలెక్టరేట్‌లో అధికారులను దామినేడు వాసులు నిలదీశారు. న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న దామినేడు వాసులు

మాల వాడిపోయింది గోవిందా..



వాడిన మాలలతో ఆంజనేయస్వామి విగ్రహం



మే నెలలో ధరింపజేసిన మాలలు

అలిపిరి కాలినడకమార్గంలో ఏడోమైలు వద్ద ఉండే ప్రసన్న ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహం వాడిన పూలమాలతో దర్శనమిస్తోంది. హనుమజ్జయంతి సందర్భంగా గత మే నెలలో ప్రసన్న ఆంజనేయస్వామికి భారీ పుష్ప, ఆకుమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆ తర్వాత వాటిని తొలగించలేదు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్లు జైలుశిక్ష

● రూ.మూడు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 21(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.మూడు లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మునియప్ప, మంజునాథ్ కొన్నేళ్లుగా శేషాచలం అడవుల్లోకి ప్రవేశించి ఎర్రచందనం చెట్లు నరికి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. 2018లో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేయడానికి ప్రయత్నిస్తుండగా పీలేరు అటవీశాఖ సెక్షన్ అధికారి ఎన్.చిన్నబాబు పట్టుకుని ఫారెస్టు కార్యాలయానికి తీసుకొచ్చారు. విచారించగా వాస్తవాలు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి విచారణ దశలో ఉన్న ఈ కేసు తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానానికి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి లైజన్ అధికారి బాబుప్రసాద్, ఏపీపీ బాలకృష్ణమ నాయుడు, ఎఫ్ఆర్వో ఖ్యాతి, కోర్టు కానిస్టేబుల్ కృష్ణమూర్తి సాక్షాధారాలను కోర్టులో సమర్పించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి నిందితులకు ఈ మేరకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

లింక్ ఓపెన్ చేస్తే రూ.50వేలు మాయం

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్తలపాళెం గ్రామానికి చెందిన ఓ యువకుడి సెల్‌ఫోన్‌కు ప్రైజ్ వచ్చిందంటూ మెసేజ్ వచ్చింది. అందులోని లింక్ ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. అంతే క్షణాల్లో అతని బ్యాంక్ ఖాతాలోని రూ.50వేల నగదు మాయమైంది. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన రాజు

బాధితులకు సత్వర న్యాయం : ఎస్పీ

● పోలీసు పీజీఆర్ఎస్‌కు 90 ఫిర్యాదులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 21(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలను సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌కు 90 వినతులు వచ్చాయి. ఏడు కౌంటర్ల ద్వారా వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను సావధానంగా విన్న ఎస్పీ కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఆయా స్టేషన్లకు పంపారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, ఎస్పీ డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు సాదిక్ ఆలీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూలో స్వయం కోర్సులకు మంచి స్పందన



ప్రశంసాపత్రంతో వీసీ అప్పారావు తదితరులు

● సైన్స్ కాలేజీకి స్వయం - ఎన్‌పీటీఈఎల్ నుంచి ప్రశంస

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ నూతన విద్యా విధానం-2020లో భాగంగా విద్యార్థులు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొందేందుకు 'స్వయం' కోర్సులను అమలు చేస్తున్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీలు ఈ విధానంలో కీలక భూమిక పోషిస్తున్నాయి. ఎస్వీయూ కూడా స్వయం కోర్సులను ప్రవేశపెట్టింది. దీనికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీనిపై స్వయం - ఎన్‌పీటీఈఎల్ నుంచి యూనివర్సిటీ సైన్స్ కాలేజీకి ప్రశంసలు లభించాయి. ఎక్కువ మంది విద్యార్థులు సైన్స్ కాలేజీ నుంచి స్వయంలో నమోదు చేసుకుని, ఉత్తీర్ణులై, సర్టిఫికెట్లు సైతం పొందారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ పద్మావతి, స్వయం ఇన్‌చార్జి భారతి, మీడియా డీన్ వీసీ వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగ విద్యార్థులకు స్వయం కోర్సులకు దరఖాస్తు చేసుకోవడంలో ఫీజు రాయితీ ఉండటం మంచి పరిణామమని అన్నారు.

చిత్తూరు డీసీసీబీకి నాబార్డు ప్రశంస

నగరి/చిత్తూరు కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): గడువుకు ముందే సింగిల్ విండోల కంప్యూటరీకరణ పూర్తి చేయడంతో పాటు జిల్లా రైతాంగానికి సహకార రంగం ద్వారా రుణాలు, అడ్వాన్సులు తదితర అంశాలలో ప్రతిభ కనబరిచిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)కు విశిష్ట గౌరవం లభించింది.నాబార్డు 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని నాబార్డు ప్రాంతీయకార్యాలయంలో సోమవారం రాష్ట్రస్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన చిత్తూరు, కృష్ణా, నెల్లూరు డీసీసీబీల అధికారులకు మెమొంటోలను అందజేశారు.సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు చేతుల మీదుగా చిత్తూరు డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు మెమొంటోను స్వీకరించారు.రాష్ట్రస్థాయిలో నాలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(సింగిల్‌విండో)ఉత్తమ పనితీరు కనబరిచినట్లు నాబార్డు గుర్తించి సన్మానించింది.చిత్తూరు జిల్లాకు సంబంధించి నిబంధనలు పాటించి బ్యాంకును ఉన్నతస్థాయికి తీసుకెళ్లడమే గాక అన్ని రకాల రుణాలను రైతులకు అందించినందుకు నగరి సింగిల్ విండో తరపున సీఈవో తులసిపిళ్లై, చైర్మన్ బాలాజి, డైరెక్టర్ జవహర్‌రెడ్డి మెమొంటో అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డు చీఫ్ మేనేజర్ గోపాల్, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మెమొంటో అందుకుంటున్న డీసీసీబీ సీఈవో శంకర బాబు, నగరి పీఏసీఎస్ సీఈవో తులసి

3 గంటలు ఆలస్యంగా నడిచిన

ఇండిగో విమానం

అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రయాణికులు

రేణిగుంట జూలై 21:(ఆంధ్రజ్యోతి) : ఇండిగో విమానం సోమవారం మూడు గంటలు ఆలస్యంగా నడవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బెంగళూరు నుంచి తిరుపతి విమానాశ్రయానికి .మధ్యాహ్నం 2.35కు వచ్చి తిరిగి హైదరాబాదుకు 2.55గంటలకు పోవాల్సిన విమానం సాంకేతిక కారణాలతో సాయంత్రం 5.05 గంటలకు వచ్చి 5.35 గంటలకు హైదరాబాదుకు వెళ్లింది. దీంతో టిక్కెట్లు బుక్ చేసుకున్న 40 మంది ప్రయాణికులు మూడు గంటలు విమానాశ్రయంలో పడిగాపులు కాశారు. ఇండిగో యాజమాన్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

9మంది స్మగ్లర్ల అరెస్టు

● 16 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మంగళం, జూలై 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా బాలపల్లి ఫారెస్టు రేంజ్‌లో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు 9 మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఏఆర్ ఎస్ఐ బాలచెన్నయ్య బృందం స్థానిక ఎఫ్‌బీవో సుబ్బలక్ష్మితో కలిసి బాలపల్లి రేంజ్ అటవీప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు.ఆ ప్రాంతంలో కొందరు వ్యక్తులు రెండు కార్లతో టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటపడటంతో వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే టాస్క్‌ఫోర్సు పోలీసులు 9మందిని పట్టుకోగలిగారు. పట్టుబడిన వారు నంద్యాల, అన్నమయ్య జిల్లా, కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించారు. వాహనంలోలోడ్ చేసిన 16 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లను వాహనాలతో సహా ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

వంతెన ప్రారంభం



వంతెన ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొగళ్ల గుంట వద్ద శ్రీశ్రీనివాస ట్రస్టు(టీవీఎస్ సంస్థ) రూ.48లక్షలతో నిర్మించిన వంతెనను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్నవారు పేదల ప్రజల జీవనోపాధి కోసం కృషి చేయాలన్నారు. వెనకబడిన పేదలను దత్తత తీసుకుని జీవనోపాధి కల్పించే విధంగా ముందుకు రావాలన్నారు. టీవీఎస్ సంస్థ మండలంలో గిరిజనల కోసం చేస్తున్న అభివృద్ధి పనులు అభినందనీయమని కొనియాడారు. ఇప్పటి వరకు 60గ్రామాల్లో రూ.10కోట్లపైగా అభివృద్ధి పనులు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీవీఎస్ సంస్థ చైర్మన్ స్వర్ణసింగ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి జయసింగ్, తహసీల్దార్ నరసింహరావు, ఎంపీపీ తనూజా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు: విజయశ్రీ



ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక నాయకులతో కలసి నాయుడుపేట మండలంలోని వేమిగుంటపాళెం, అన్నమేడు, మర్లపల్లి, కాపులూరు, కూచివాడ, చిలమత్తూరు పంచాయతీల్లో పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారధి, కామిరెడ్డి అశోక్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీరాంప్రసాద్, మాజీ ఎంపీపీ కన్నెమ్మ, సుజాత, చక్రపాణి, చెంచయ్య, బాబురెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌కు ప్రత్యామ్నాయ స్థలం చూపండి

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట రోడ్డులో డీవీఎస్ కాలనీ సమీపంలో ఉన్న చేపల మార్కెట్‌కు ప్రత్యామ్నాయంగా స్థలం చూపించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు సీపీఐ ఆధ్వర్యంలో చేపల విక్రయదారులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు ఆనంద్ మాట్లాడుతూ చేపల మార్కెట్‌ను ఖాళీ చేయాలని షార్ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రత్యామ్నాయంగా అదే రోడ్డులో సాయిబాబు ఆలయం నుంచి హోలీక్రాస్ సర్కిల్ వరకు ఎక్కడైన స్థలం చూపించాలని కమిషనర్‌ను కోరారు. కారక్రమంలో అశోక్, లక్ష్మి, అముద తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోండి

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గూడూరు ఒకటో, రెండో పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణం గత 13 ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని, వంతెనను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుబ్బరామరాజు, బ్రహ్మయ్య, వేమయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నాయుడుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు పెంచాలంటూ సోమవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నాయుడుపేట పురవీధుల్లో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ పెరిగిన నిత్యవర సరుకులు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ కార్మికులకు రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. మున్సిపల్ కార్మికులకు అంగన్‌వాడీ కార్మికులు సంఘీభావాన్ని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శివకవి ముకుంద, లక్ష్మి, శ్యామలమ్మ, శ్రీనివాసులు, నాగరాజు, రామచంద్రయ్య, వీరాస్వామి, రమేష్, కాలేషా, సురేష్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సూళ్లూరుపేట, జూలై 21(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేసే ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కరించాలంటూ చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్మికుల సమ్మెకు అంగన్వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ నాయకురాలు హైమావతి, సీఐటీయూ నాయకులు సాంబశివయ్య, లక్ష్మయ్య అక్బర్ మద్దతు తెలిపారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

గూడూరు అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం గూడూరు పర్యటకు విచ్చేన ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దనరెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. గూడూరును తిరుపతి జిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, రమేష్, సీవీఆర్ కుమార్, సునీల్, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అవగాహన

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉగ్గుముడి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు టీబీ వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పేర్నాడు పీహెచ్‌సీ వైద్యుడు ఇలకా రమణయ్య మాట్లాడుతూ టీబీ వ్యాధి పూర్తిస్థాయి నివారణకు ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తోందన్నారు. బరువు తగ్గడం, తగ్గు, జ్వరం, గొంతు భాగంలో గడ్డలు ఉంటే ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం నెలకి రూ.1000 పోషకాహారం కోసం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ బాల, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్, ఏఎన్ఎం, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు 6వ వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు'

వెంకటగిరి టౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ 6వ వార్డులో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణాధ్యక్షుడు గంగాధర్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వార్డులో పర్యటిస్తారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా రాజశేఖరరెడ్డి బాధ్యతల స్వీకరణ

చిల్లకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంట పాళెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా దువ్వూరు రాజశేఖరరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో రాజనేని రామయ్యనాయుడు, నెల్లటూరు చిరంజీవి, శ్రీనివాసులు, కోటయ్య, కుమార్, సతీష్‌రెడ్డి, ప్రభాకర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి వినతి

కోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కోటలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దరెడ్డిని మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



టెంకాయతోపు గ్రామంలో అంతర్గత రోడ్లపై చేరిన వర్షపునీరు

బయటకు వచ్చేదెలా!

- జలదిగ్బంధంలో టెంకాయతోపు
- వర్షం వచ్చిన ప్రతిసారీ ఇదే పరిస్థితి
- నీళ్లు బయటకు పోయేందుకు మార్గం లేక ఇబ్బందులు

పెళ్లకూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అదో చిన్న కుగ్రామం.. ఓ పక్క జాతీయ రహదారి.. మరో పక్క పంటపొలాలు.. చినుకుపడితే గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకోవాల్సిందే. వర్షపు నీరు వెలుపలకు వెళ్లే మార్గంలేక ప్రజలు ఇళ్లలో నుంచి బయట అడుగుపెట్టలేని ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని నెలబల్లి పంచాయతీ పరిధిలోని టెంకాయతోపు గ్రామం నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారికి పక్కనే ఉంది. ఇక్కడ నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిలో భాగంగా ఫ్లైఓవర్ నిర్మించారు. దీంతో జాతీయ రహదారి ఎత్తు పెరిగి గ్రామం లోతులో ఉండడంతో వర్షం వచ్చిన ప్రతిసారి నీళ్ల బయటకు వెళ్లే పరిస్థితి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో గ్రామంలోని అంతర్గత రోడ్లపై నీరు నిలిచిపోయి కుంటలను తలపిస్తున్నాయి. అడుగుతీసి అడుగు వేయాలంటే జనం భయభ్రాంతులకు గురవుతునన్నారు. బయట వెళ్లలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవ చూపి సమస్య పరిష్కరించాలని టెంకాయతోపు గ్రామస్తులు కోరుతున్నారు.

హామీలను నెరవేర్చే సమర్థుడు చంద్రబాబే

మంత్రి జనార్దనరెడ్డి



కరపత్రాలు అందజేసి సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చే సమర్థత సీఎం చంద్రబాబు నాయుడుకే ఉందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దనరెడ్డి అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని జనార్దనరెడ్డి కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అరాచకపాలన వల్ల రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ఎంతో మంది పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లారన్నారు. వైసీపీ నాయకులు మద్యం కుంభకోణానికి పాల్పడి వేల కోట్ల రూపాయలను లూటీ చేశారని, అక్రమ మైనింగ్‌తో సహజ సంపదను దోచుకున్నారన్నారు. వైసీపీ అరాచక పాలనను తట్టుకోలేని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా వారిలో మార్పు రాలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వీటిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్, పంబలేరు బ్రిడ్జి నిర్మాణాలను ఆర్‌అండ్‌బీ మంత్రి సహకారంతో సీఎం దృష్టికి తీసుకువెళ్లి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పంబలేరు బ్రిడ్జిని మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో చర్చించి వంతెన పూర్తయ్యేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా గత ప్రభుత్వం అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.9కోట్లు అవసరమవుతాయని, సీఎం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, చంద్రమౌళి, మట్టం శ్రావణి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, లీలావతి, చంద్రనీల్, మోహన్ నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జనార్దనరెడ్డికి స్వాగతం

చిల్లకూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): గూడూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి జనార్దనరెడ్డికి సోమవారం చిల్లకూరులోని జాతీయ రహదారిపై ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, తానంకి నానాజీ, నాయకులు ఘన స్వాగతం పలికారు. కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రిని, ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, నెల్లటూరు చిరంజీవి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, పద్మజ, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కీరవాణి, మునిశేఖర్‌గౌడ్, సతీష్ యాదవ్, శివకుమార్, నరసింహులు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

చిట్టమూరు, జులై 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్టమూరులో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు పర్యవేక్షణలో క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్యశాఖ సహకారంతో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చిట్టమూరు వైద్యాధికారి పద్మావతి, సిమ్స్ వైద్యులు సుఖేంద్ర, మెడికల్ ఆఫీసర్ చైతన్య భాను, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది బాబూరావు, హైమావతి, నాగేశ్వరరావు, దేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

సూళ్లూరుపేట, నాయుడుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబరులో వరదల తాకిడికి పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద రైతులు నిరసన తెలిపారు. ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాజారెడ్డి, నాయకులు శశికిరణ్, ప్రసాద్, మదనంబేటి శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, ప్రసాద్, వెంకటాచలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

కోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సంక్షేమ పథకాల అమలుపై ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వేణు సమీక్ష నిర్వహించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

వాకాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డి పాళెం గ్రామంలో వెలసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధుకిరణ్‌రెడ్డి కుటుంబసభ్యుల దాతృత్వంతో కల్యాణ మహోత్సవాన్ని పురోహితులు జరిపించారు. కార్యక్రమంలో జిల్లా అర్చక మండలి సభ్యులు దివి అనంతాచార్యులు, నరేష్‌శర్మ, ఆలయ నిర్వాహకులు చిన్నయ్య, సులాభాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి శిక్షణ

తడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులో వాహన తనిఖీలపై ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గూడూరు ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఊహశ్రీ ఆధ్వర్యంలో సుమారు 103 మంది అధికారులు, ఉద్యోగులు సోమవారం భీములవారిపాళెం చెక్‌పోస్టులో వాహన తనిఖీలకు తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. చెన్నై వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో చెక్‌పోస్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

ఆదర్శంగా గిరిజన గురుకులాలు



చిట్టేడు గిరిజన గురుకులాన్ని పరిశీలిస్తున్న ఏపీటీ, ఏఎంవోలు

కోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సహకారంతో గిరిజన గురుకులాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సమగ్రశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు, ఏఎంవో శివశంకర్ అన్నారు. కోట మండలం చిట్టేడులోని యానాదుల గురుకుల కళాశాలను సోమవారం తనిఖీ చేశారు. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగే సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తానయ్య, ప్రిన్సిపాల్ శుభకర్‌రావు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించండి

కోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న తమపై పనిభారం తగ్గించకపోతే ఉద్యమిస్తామని అంగన్‌వాడీ వర్కర్లు హెచ్చరించారు. సోమవారం కోటలోని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లు పనిభారం తగ్గించాలంటూ నిరసన తెలిపారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాలు పద్మలీల, విజయమ్మ, కోటేశ్వరి పాల్గొన్నారు.

యాప్‌లను రద్దు చేయాలి

గూడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లలో యాప్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ఆసియా, భారతమ్మ, పెంచలమ్మ, రోజా, అలేఖ్య, శివకుమార్, బీవీ.రమణయ్య, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించండి

వెంకటగిరి, జులై 21 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించాలని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు అన్నారు. సోమవారం మొగళ్లగుంట పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆయన కలిశారు. వచ్చే నెలలో ఈజీప్టులో జరిగే అంతర్జాతీయ గోల్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైన వెంకటగిరికి చెందిన బ్లైండ్ క్రీడాకారుడు ముప్పాళ శేషగిరిని కలెక్టరు, ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. ఇలాంటి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తే రాణిస్తారని అన్నారు. బ్లైండ్ క్రీడాకారులకు అండగా నిలుస్తున్న రాష్ట్ర బ్లైండ్స్ అసోషియేషన్ అధ్యక్షులు పచ్చూరు నరసయ్య నాయుడును మాధవనాయుడు అభినందించారు.

చెరువు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

చిట్టమూరు, జులై 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి పాడేరు చెరువు సమీపంలో సోమవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. యాకసిరి రెవెన్యూ పరిధిలోని 425 సర్వే నెంబర్‌లో గ్రావెల్ తవ్వకాలను ఆపివేస్తూ హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యాకసిరి పాడేరు చెరువు సమీపంలో నుంచి ఎవరూ గ్రావెల్ తరలించరాదని తహసీల్దార్ సతీష్ కుమార్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయన వెంట రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్, డీటీ నరేష్, మండల సర్వేయర్ వెంకటేష్ ఉన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలి

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ ఒప్పందంతోనే స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారని విమర్శించారు. అనంతరం విద్యుత్ శాఖ పట్టణ ఏఈ మోహినికి వినతిపత్రం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో శ్రీసిటీ ఉద్యోగి మృతి

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం కుదిరి వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీసిటీ కొబెల్కో కంపెనీలో పనిచేస్తున్న కొల్లూరు వంశీ(25) మృతి చెందాడు. పోలీసులు సమాచారం మేరకు... బాపట్ల జిల్లా పల్లూరు గ్రామానికి చెందిన వంశీ శ్రీసిటీ పారిశ్రామికవాడలోని గోబెల్కో పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. సూళ్లూరుపేట షార్ వై జంక్షన్ సమీపంలో స్నేహితులతో కలిసి అద్దె గదిలో ఉంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో సాయంత్రం సరదాగా మోటరు సైకిల్‌పై శ్రీహరికోట మార్గంలో పులికాట్ సరస్సును వీక్షించేందుకు వెళ్లాడు. రాత్రి తిరిగి వచ్చే సమయంలో కుదిరి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే వంశీ మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి బంధవులుకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన సుమతి

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాలపురంలో ఉంటున్న సుమతి (32) ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.... వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామానికి చెందిన సుమతితో బాలయపల్లి మండలం కాట్రగుంట గ్రామానికి చెందిన మస్తానయ్యకు 2020లో వివాహం జరిగింది. సుమతి మేనకూరు సెజ్‌లో ఓ కర్మాగారంలో పనిచేస్తూ నాయుడుపేటలో నివాసం ఉంటోంది. ఈనెల 18వ తేదీ సుమతి భర్త కేరళకు బంధువులతో కలసి వెళ్లాడు. ఆదివారం మధ్యాహ్నం భర్తకు ఫోన్‌చేసి తక్షణమే నాయుడు పేటకు బయలుదేరి రావాలని కోరింది. లేకుంటే ఇదే చివరి కాల్ అని మెసేజ్ పంపింది. అనంతరం తన గదిలో ఉరివేసుకొని సుమతి మృతి చెందింది. మస్తానయ్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా సుమతి తీయకపోవడంతో తన స్నేహితులకు ఫోన్‌చేసి నాయుడుపేటలో సుమతి ఇంటికి వెళ్లమని చెప్పాడు. మస్తానయ్య స్నేహితులు వెళ్లి కిటికీలో నుంచి చూడగా సుమతి ఉరివేసుకొని ఉన్నట్లు గుర్తించారు. అర్బన్ సీఐ బాబి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో నుంచి పడి ఉత్తరప్రదేశ్ యువకుడి మృతి



తానికుమార్ (ఫైల్‌ఫోటో)

నాయుడుపేట టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి ఉత్తరప్రదేశ్ యువకుడు తానికుమార్(19) మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొంతమంది యువకులు కూలి పనుల నిమిత్తం కర్నాటకకు రైల్లో బయలుదేరారు. బిరదవాడ సమీపంలో వెళ్తుండగా తానికుమార్ బాతురూంకు వెళ్లాడు. అదే సమయంలో ద్వారం వద్ద నిలబడి ఉండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. తోటి స్నేహితులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మూడు పందుల మృతి

సూళ్లూరుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో వాకాటి నారాయణరెడ్డి నగర్ వద్ద రోడ్డు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సోమవారం విద్యుదాఘాతం జరగడంతో మూడు పందులు మృతి చెందాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నీళ్ల నిలిచాయి. సోమవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ పక్కన చెత్తకుప్పలో ఆహారం కోసం వెళ్లిన పందులు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి.

గ్రామసభలు

బాలయపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరిమిడి, ఉట్లపల్లి సచివాలయాల వద్ద సోమవారం పీ-4 సర్వేపై అభిప్రాయాల సేకరణకు గ్రామ సభలు నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచు వనమ్మ, టీడీపీ నాయకులు మురళి, ఆర్ముగం పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం

నాయుడుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట బజారువీధిలో సోమవారం ఓ ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధమైంది. వెంకటేష్ బజారువీధిలోని తన దుకాణం ఎదుట స్కూటీని ఆపి ఉంచాడు. అకస్మాత్తుగా స్కూటీలోని బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించాయి. మంటలను ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినా లాభం లేకపోయింది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

కోట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు తావివ్వకూడదని, నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జయజయరావు, సీఎస్‌డీటీ అజ్మతుల్లాఖాన్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. బియ్యం, సరుకులు పంపిణీలో ఎక్కడా ఎలాంటి లోపాలు జరగరాదన్నారు.